ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 | సంచిక : 08 | ఏప్రియల్ 2011

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-02-2010, అర్తమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అర్తమూరు గ్రామం ప్రాచీనమైన గ్రామం, ఈ గ్రామానికి సుమారు 2000 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ గ్రామంలో ప్రాచీనమైన శివాలయాలు ఉన్నాయి. రమణస్వామి, బుద్ధుడు, ఏసుక్రీస్తు, రామకృష్ణుడు వీరు అందరూ మహాజ్ఞానులు, ప్రేమమూర్తులు, దయామూర్తులు. రమణమహర్షి దగ్గరికి పాములు వచ్చేవి, చిరుత పులులు వచ్చేవి, పాములు, చిరుతపులులకి ఆయన ఏమీ అపకారం చేయలేదు, చిరుతపులులు, పాములు స్వామికి ఏమీ అపకారం చేయలేదు. ఇవన్నీ మహిమలు కాదు. వారు సృష్టిని ప్రేమించటం వలన మానవజాతి మీదే కాకుండా జంతుజాలం మీద కూడా ఆ ప్రేమ వ్యాపించటం వలన భగవాన్ దగ్గరికి అవి వచ్చేవి, భగవాన్‌కి అపకారం చేయకుండా, అవి అపకారం చేయబడకుండా వెళ్ళిపోతూఉండేవి. వారు జ్ఞానదాతలు, ప్రేమదాతలు, వారు అనుగ్రహస్వరూపులు. మనుషుల ప్రేమ నిత్యముగా ఉండదు. నిజమైన ప్రేమ, దివ్యమైన ప్రేమ, అలౌకికమైన ప్రేమ చనిపోయేవరకూ ఉంటుంది. లౌకికులు ప్రేమగా ఉంటారు అందులో స్వార్థం ఉంటుంది, కామవాసన ఉంటుంది. మనం స్వార్థం తోటి ఎవరినైనా ప్రేమిస్తూ ఉంటే, మోహం పెట్టుకుని మనం ఎవరినైనా ప్రేమిస్తూ ఉంటే అది ఏదో ఒకరోజున బ్రేక్ అయిపోతుంది. స్వార్థంతో కూడిన ప్రేమ, మోహంతో కూడిన ప్రేమ అవి స్మశానానికి వెళ్ళేవరకూ నిలబడవు. ప్రతిఫలాన్ని కాంక్షించకుండా ఉండే ప్రేమ, దయాపూరిత

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 32
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

అర్తమూరు ...... 14-02-2010
భీమవరం ....... 21-02-2011
పాలమూరు .... 06-03-2011
గొరగనమూడి . 05-12-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

మైనటువంటి ప్రేమ ఆ రెండు శరీరాలు చనిపోయేవరకూ ఆ ప్రేమ ఉంటుంది. అందుచేత ఆత్మప్రేమే నిజమైనప్రేమ, మనోగతమైన ప్రేమ నిజంకాదు. భగవంతుడు మన గురించి ఏమనుకుంటున్నాడు అని అనుకోవటం కంటే, మన గురించి మనం ఏమనుకుంటున్నాము, అసలు మన మనస్సులో ఏముంది, మనకి వచ్చే సంకల్పాలు, తలంపులు ఎటువంటివి వస్తున్నాయి అని ముందు మనం పరిశీలన చేసుకోవాలి. మనం అందరం నేను, నేను అంటున్నాము అది నిజం కాదు, అది ఒక తలంపు మాత్రమే. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈనేను అనే తలంపు, నేను అనే భావనలో నుండి విడుదల పొందటమే మన ధ్యేయం. మనకి నేను అనేటప్పటికి దేహం స్ఫురిస్తోంది అందుచేత అది దాటేవరకూ నీకు ఆనందము లేదు, శాంతి లేదు, సుఖము లేదు. ఇక్కడ ఇంతమంది భక్తులు ఉన్నారు. ఇందులో ఎవరు స్వేచ్ఛగా ఉన్నారు, ఎవరు సుఖంగా ఉన్నారు, ఎవరు ఆనందంగా ఉన్నారు అని చూస్తే ఎవ్వరూ శాంతిగా లేరు. ఊరికే అలాగ ఉన్నామని అనుకుంటారు. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటే సుఖంగా ఉన్నామని అనుకుంటారు, పరిస్థితులు మీకు ప్రతికూలంగా ఉంటే దుఃఖము వచ్చింది అనుకుంటారు ఇవన్నీ వ్యవహారికాలే.

కామవాసన ఎంతకాలం ఉంటుంది అని ఒకరు అడిగారు. మనకి దేహాభిమానం ఉన్నంతకాలం, దేహబుద్ధి ఉన్నంతకాలం కామవాసన కూడా ఉంటుంది. మనం శివుడినో, విష్ణువునో ఉపాసన చేయటం వలన అది అణిగి ఉండవచ్చు కాని అది పూర్తిగా నాశనం కాదు. దేహాభిమానం తగ్గేవరకూ కామవాసన కూడా నాశనం కాదు. మీరు ఇది దృష్టిలో పెట్టుకోండి. మనం ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోవాలి. ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకుంటే మన మనస్సు అసలు బాహ్యముఖానికి వెళ్లదు. మాకు వారంటే ప్రేమ, వీరంటే ప్రేమ అని చెబుతారు. మీరు ఎవరినైతే ప్రేమిస్తున్నారో అక్కడ మమకారం ఉందో లేదో చూసుకోండి, అక్కడ మీకు మమకారం ఉంటే, ఆ మమకారాన్ని బట్టి మీరు ప్రేమిస్తూ ఉంటే అది నూటికి నూరు పాళ్ళు అసత్యం. ఆ ప్రేమ మిమ్మల్ని బంధిస్తుంది కాని మిమ్మల్ని విడుదల చెయ్యదు. మమకారం ఎక్కడ ఉందో అక్కడ ఇష్టపడి వారిమీద మాకేదో ప్రేమ ఉంది అనుకుంటారు కాని అది ప్రేమ కాదు కామం, నూటికి నూరుపాళ్ళు అజ్ఞానం.

ఐన్‌స్టీన్ ఒకమాట చెప్పాడు. ప్రపంచంలో చీకటి అంటూ ఎక్కడా లేదు. ప్రపంచంలో చీకటి అంటూ ఉంటే నీలోపల ఉన్న అజ్ఞానమే చీకటి అన్నాడు. ఆయన భక్తుడు కాదు, గ్రేటెస్ట్

సైంటిస్ట్. నీకు ఉన్న అజ్ఞానమే చీకటి, నీకు ఉన్న అజ్ఞానమే అశాంతి, నీకు ఉన్న అజ్ఞానమే దుఃఖం. ఇతరులలో కంటే నాలో ప్రత్యేకత ఏదో ఉందనుకోవటానికి కూడా నీ అజ్ఞానమే కారణం. మనకి గాఢనిద్ర పెద్ద గురువు అని భగవాన్ తరచు చెప్పేవారు. గాఢనిద్రలో దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి, ప్రపంచంతోటి, దేవతలతోటి సంబంధంలేకుండా నువ్వు ఉన్నావు. ఆ గాఢనిద్రలో ఏది ఉందో అదే జాగ్రదావస్థలో కూడా ఉంది. జాగ్రదా వస్థలో ఉన్నా అది మనకి అనుభవంలోనికి రావటంలేదు. అది అనుభవంలోనికి తెచ్చుకోవటమే ఆత్మజ్ఞానం. అప్పటివరకూ ఏమనిషికి స్వేచ్ఛలేదు, సుఖంలేదు, శాంతిలేదు, ఆనందంలేదు.

ఒకో ఇంద్రియానికి ఒకో వాసన ఉంటుంది. కామం అంటే కోరిక. కళ్ళకి కామం ఉంటుంది, చెవులకి కామం ఉంటుంది, ముక్కుకి కామం ఉంటుంది, అలా అన్ని ఇంద్రియాలకి కామం ఉంటుంది. కళ్ళకి కామం ఏమిటి అంటే కొంతమంది సినిమాలు చూద్దాము, టి.వి.లు చూద్దాము అనుకుంటారు. మనకి రూపబుద్ధి, నామ బుద్ధి ఉంది కాబట్టి టి.వి.లో ఉన్న రూపాలని చూడాలని ఉంటుంది. అది కళ్ళకు కామం. ఏరూపం, ఏనామం కూడా నిజం కాదు. ఈ రూపాలకి, ఈ నామాలకి ఆధారంగా ఒక సత్యం ఉంది, అది ఒక్కటే నిజం. లోకవాసన ఎక్కువ ఉన్నవాళ్ళు లోకానికి సంబంధించిన గొడవలు వింటారు కాని, దైవం గురించి కాని, చైతన్యం గురించి కాని వారు వినరు. కొంతమంది ఎవరి గురించి అయినా చెడ్డ చెబుతా ఉంటే శ్రద్ధగా వింటారు కాని, మంచి చెబుతా ఉంటే చెవులు మూసుకుంటారు అది చెవులకు ఉన్న కామం. కొంతమంది సెంటు రాసుకుంటారు. ముక్కుకి అన్ని సువాసనలు కావాలి. అది ముక్కుకి సంబంధించిన కామం. చర్మానికి స్పర్శ అంటే ఇష్టం. అది చర్మానికి సంబంధించినటువంటి కామం. ఇలా అన్ని ఇంద్రియాలకి కామం ఉంటుంది. అజ్ఞానం ఉంటే అంతా ఉంది, అజ్ఞానం లేకపోతే ఏదీ లేదు అని భగవాన్ చెప్పేవారు. నీకు అజ్ఞానం ఉండటం వలన ఒకటి అనేకంగా కనిపిస్తోంది. మనకు ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి మనం ఏమీ సాధన చేయటం లేదు. సాధకులు గుర్తించుకోవలసినది ఏమిటంటే కొంతమందికి బుద్ధి ఎక్కువ ఉంటుంది, ఆలోచనాశక్తి ఉంటుంది. వాళ్ళకి జ్ఞానమార్గం ఇష్టంగా ఉంటుంది. భక్తిమార్గం అంటే బుద్ధి తక్కువగా ఉండి, మనస్సు ఎక్కువగా ఉంటే వాళ్ళు భక్తి మార్గానికి ఇష్టపడతారు. మీరు జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా, భక్తిమార్గంలో ప్రయాణం చేసినా ప్రపంచానికి సంబంధించిన ఆకర్షణలు మీకు ఎంతవరకూ నశిస్తున్నాయో

చూచుకోవాలి. మిగతా గొడవలు మీకు అనవసరం. మీరు భక్తిమార్గంలో ఉంటే వాసనాక్షయం తొందరగా అవుతుంది అని రామకృష్ణపరమహంస గారు చెప్పేవారు.

మీరు ఈ దేహంలో ఉండగానే, మీరు కష్టసుఖాలు అనుభవించేటప్పడే వీటినన్నింటిని అతిక్రమించి మిమ్మల్ని హృదయగుహలోనికి తీసుకువెళ్ళటానికే భగవాన్ ప్రయత్నం చేసారు. ఎక్కడైతే చావులు లేవో, ఎక్కడైతే పుట్టుకలు లేవో, ఎక్కడైతే భయాలు లేవో, ఎక్కడైతే ద్వేషాలు లేవో, ఎక్కడైతే సంకల్పాలు లేవో అక్కడికి మిమ్మల్ని మేల్కొల్పటానికి చేస్తున్న ప్రయత్నమే రమణబోధ. మన ప్రారబ్ధాన్ని బట్టే ఈశ్వరుడు నడిపిస్తాడు. ప్రారబ్ధం దేహానికే కాని చైతన్యానికి ప్రారబ్దం లేదు. చైతన్యానుభవం మీకు కలిగినప్పడు చైతన్యానికి ప్రారబ్ధం లేదని మీకు తెలుస్తుంది. అప్పడు ఈ ప్రారబ్ధం అనుభవించేది మీరు కాదని మీకు తెలుస్తుంది. మీ కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా, మీకు మనస్సుతోటి, దేహంతోటి తాదాత్మ్యం లేకపోతే హద్దులులేని శాంతి, హద్దులులేని సుఖం, పరిమితులు లేని స్వేచ్ఛని మీరు ఇక్కడే, ఇప్పడే అనుభవిస్తారు. మీరు పూజ చేశారనుకోండి, జపం చేశారనుకోండి మీ మనస్సు అణిగి ఉంటుంది, మీ ఇంద్రియాలు అణిగి ఉంటాయి కానీ లోపల పాపపు దుంప అలాగే ఉంటుంది. వేసవికాలం గడ్డి అంతా ఎండిపోతుంది కానీ మళ్ళీ వర్షం కురిసేటప్పటికి పచ్చగడ్డి మామూలుగా వచ్చేస్తుంది. అలాగే మీకు ఇప్పడు భోగాలు లేవు అనుకోండి కానీ ఆభోగాలు పొందే అవకాశాలు మీకు వచ్చాయి అనుకోండి వర్షాకాలం లోపల దుంపలన్నీ మళ్ళీ గడ్డికింద వచ్చినట్టే మన లోపల ఈ నేను అనే దుంప ఉంది కదా ఆ పాపపు దుంపలోంచి అన్ని గొడవలూ వచ్చేస్తాయి. అన్ని భోగాలు మీకే కావాలి, అన్ని ఆకర్షణలు మీకే కావాలి. అధికారంలో ఉన్నవాళ్ళని మీరు విమర్శిస్తారు. నువ్వు మంచివాడవో, చెడ్డవాడవో నీకు అధికారం లేనప్పడు ఏమి తెలుస్తుంది. నీకు అన్ని ఆకర్షణలు ఎదురుగుండా ఉండి, అన్ని భోగాలు ఎదురుగుండా ఉంటే అప్పడు కూడా నీకు ఎటువంటి ఆకర్షణ లేనప్పడు నువ్వు మంచివాడు కిందలెక్క. అధికారంలో ఉండగా వాడు పరమపవిత్రుడుగా ఉంటే అక్కడ పాపపు దుంప నశిస్తుంది. మనిషి చనిపోవటానికి వంద రోగాలు అక్కరలేదు, ఏదో ఒక రోగం చాలు. అలాగే మనిషి పాడైపోవటానికి వంద వాసనలు అక్కరలేదు, మనిషి పాడైపోవటానికి ఒక అలవాటు చాలు. మీకు పేకాట అలవాటు ఉంది అనుకోండి వంద ఎకరాలు ఐదు సంవత్సరాలలో ఆర్పేస్తారు. అంటే ఒక్క అలవాటు మీకు వంద ఎకరాలని ఆర్పేస్తుంది.

ఆలోచన అమృతంతోటి సమానం. మీరు సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి. మీకు అనేక తలంపులు వస్తున్నాయి, ఆ తలంపులు ఎందుకు వస్తున్నాయి అని మీరు ఆలోచించుకోండి దానికి కారణం ఈ దేహమే. ఈ పాపపుదుంప అంతా ఇక్కడే ఉంది. ఈ దేహము నేను అనే బుద్ధిలోంచే మీకు అన్ని తలంపులు వస్తున్నాయి. మీరు విచారణ ద్వారా ఆ దేహగతమైన నేనుని పోగోట్టుకోవటం ఒక మార్గం. ఆమార్గం నీకు ఇష్టం లేకపోతే ఏకవస్తువుని చింతించటం ద్వారా కూడా అదే ఫలితాన్ని పొందుతారు. భగవంతుడిని ఆరాధించటం వలన, భగవంతుడిని నిరంతరం స్మరించటం వలన మీకు ఎటువంటి ఫలితం వస్తుందో అలాగే బ్రాహ్మీస్థితిని పొందినవాడిని గౌరవించినా, ఆరాధించినా అదే ఫలితాన్ని పొందుతారు అని వేదంలో చెప్పారు. నీ హృదయంలో ఉన్న సత్యం నీమనస్సుకు అందదు, మనస్సు ఎక్కడైతే పూర్తిగా అణిగిపోయి కాలి బూడిద అయిపోయిందో అక్కడే సత్యం స్వరూపంగా నీకు వ్యక్తమవుతుంది. ఈ మనస్సు ఏమి చేస్తుంది అంటే మనం చనిపోయే వరకూ అది కల్పించిన విషయాలతో తిరుగుతూ ఉంటుంది. దానికి ఇంకో పనిలేదు. అది ఏదైతే కల్పించిందో అదే దానికి నిజం అనిపిస్తుంది. అదే నిజం అనుకుని అక్కడే తిరుగుతూ ఉంటుంది. ఏదో ఒక రోజున మన శరీరం చనిపోతుంది, మళ్ళీ ఆ మనస్సే కొత్త దేహాన్ని తొడుగుతుంది అదే పునర్జన్మ. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా మనస్సు కల్పించిన గొడవలలోంచి మన మనస్సు బయటకురాలేదు. నువ్వు చేసే పూజలు, జపాలు, దానధర్మాలు వీటి అన్నింటికంటే కూడా ఒక మహాజ్ఞాని యొక్క దయ నీశిరస్సు మీద పడితే అది నీ మనస్సు కల్పించిన విషయాలలోంచి మనస్సుని బయటకు లాగి కాల్చి బూడిద చేస్తుంది. జ్ఞాని యొక్క దయ, జ్ఞాని యొక్క చూపు అటువంటిది.

వేదం చదివేటప్పుడుకాని, భగవద్గీత చదివేటప్పుడుకాని, మహాత్ములు, మహర్షుల యొక్క వాక్యాలు వినేటప్పుడుకాని ఒకటి గుర్తుపెట్టుకోండి. వారు చెప్పినవి సత్యం అయినా మనకి అసత్యాలు కింద అనిపిస్తాయి. మనకి ఉన్న దేహవాసన, మనకి ఉన్న లోకవాసన మహాత్ములు చెప్పిన మాటలు నిజం అని నమ్మనివ్వవు. మన మనస్సు అనుకున్నది నిజం అనిపిస్తుంది, ఈశ్వరుడు చెప్పింది అబద్దం అనిపిస్తుంది. దానికి కారణం ఏమిటి అంటే ఈశ్వరుడు చెప్పిన వాక్యముకంటె తను కల్పించిందే నిజం అని మన మనస్సు చెబుతుంది. మీరు అందరూ బాగుపడాలంటే భగవద్గీతలో భగవంతుడు చెప్పిన వాక్యాలు కొన్ని మీ

హృదయంలో నింపుకోండి. మీకు సైతాను ఎప్పుడైనా విజృంభిస్తూ ఉంటుంది. అది విజృంభించినపుడు భగవంతుడిని స్మరించుకొంటూ, ఆయన చెప్పిన వాక్యాలలో మీకు ఏ వాక్యాలు అయితే నచ్చినవో ఆ వాక్యాలని హృదయంలో నింపుకుంటే మీలోపల ఉన్న పాపపు తలంపులు పాపపు గింజలన్నీ కాలి బూడిద అయిపోతాయి.

మీ మాటద్వారా, మీ ఆలోచన ద్వారా, మీ చేత ద్వారా మీ దేహబుద్ధి పెరగకూడదు. దేహబుద్ధితోటి సంబంధంలేని మాటలు మాట్లాడండి, దేహబుద్ధితోటి సంబంధంలేని పనులు చేయండి, దేహబుద్ధితగ్గే ఆలోచనలు చేయండి. శారీరక తపస్సు, మానసిక తపస్సు, వాక్కు తపస్సు. మీరు వాక్కుతోటి ఎవరినీ హింసపెట్టకూడదు. ఇతరులు వారి మాటలద్వారా మిమ్మల్ని హింసపెట్టినా మీరు హర్ట్ అవ్వకూడదు. అంటే ఈ మాటలకి, చేతలకి, ఈ ఆలోచనలకి మీరు అతీతంగా ఉండటం నేర్చుకుంటే మీకు రోజులు శాంతిగా వెళ్ళిపోతాయి. మనం దైనందిన జీవితంలో ఎలా జీవిస్తున్నాము అనే ఆలోచన వదిలేసి ఏదో తపస్సులు చేస్తున్నాము అంటున్నారు. దేనికి ఆ తపస్సులు? తపస్సు చేసి, నువ్వేమైనా మారు మనస్సు పొందావా? నీ ఆలోచనలో ఏమైనా మార్పు వచ్చిందా? నీ ఆలోచనలో మార్పు లేదు, నీ ప్రవర్తనలో మార్పులేదు. మీరు దేనికి తపస్సులు చేస్తున్నారు? నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించటానికి దానికి వ్యతిరేకంగా ఏ అలవాట్లు ఉన్నాయో, ఏ గుణాలు ఉన్నాయో వాటిని ఎండబెట్టటమే తపస్సు. మనకి బ్రహ్మము అనుభవంలోనికి రాకుండా మీలో ఏ ఆలోచనలు, ఏ గుణాలు, ఏ అలవాట్లు అడ్డువస్తున్నాయో చూచుకోండి. వాటిని జాగ్రత్తగా ఎండింపచేయటమే తపస్సు. నేను, నేను అనే తలంపు కొంచెము కూడా లేని వస్తువులోనికి, ఆ హృదయస్థానంలోకి ప్రవేశించటమే తపస్సు అన్నారు భగవాన్.

నువ్వు భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా చిత్త శుద్ధితోటి చెయ్యాలి. మనం ఎవరింటికైనా వెళ్ళినప్పడు ఏదో ఒక గుమ్మంలోనుండి లోపలకు వెళ్ళాలి. అలాగే మీరు చిత్తశుద్ధి అనే గుమ్మంలో నుండి ఆత్మజ్ఞానంలోనికి వెళ్ళాలి కాని ఇంకో మార్గంలేదు. చిత్తశుద్ధిలేని శివపూజలు ఏల అన్నాడు వేమన. చిత్తశుద్ధి ఎలా ఉంటుందో నీకు తెలియదు అనుకో హృదయం అనే గుహలోనికి నువ్వు ప్రవేశించలేవు. హృదయ గుహలో ప్రవేశించాలంటే నీకు చిత్తశుద్ధి ఉండాలి. ఆ హృదయగుహలో ఈశ్వరుడు ఉన్నాడు. ఆలోచన, మాట, చేత ఎవరికైతే మూడు ఒకటిగా ఉన్నాయో వాడికి మాత్రమే

చిత్తశుద్ధి కలుగుతుంది. మహాత్మాగాంధీ గారి మీటింగులో ఏదైనా అల్లరి జరుగుతోంది అనుకోండి మీరు అల్లరి చేయకండి అని గాంధీగారు అనేవారుకాదు. మౌనంగా చెయ్యి పైకెత్తేవారు అంతే అంతా నిశ్శబ్ధం అయిపోయేది. దానినే ఆత్మశక్తి అంటారు. ఆత్మకి మరోపేరే ప్రేమ, శాంతి. ఆత్మకి మరోపేరే ఉండటం. మీకు అందరికీ ఉండాలని ఉందా? చనిపోవాలని ఉందా? అందరికీ ఉండాలనే ఉంది. ఆ ఉండటమే దేవుడు. ఆ ఉండటం అనే స్థాయిని నువ్వు పొందితే వాడు ధనవంతుడు, వీడు పేదవాడు, వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అనే భేదము లేకుండా సృష్టికంతా నీ ప్రేమను పంచిపెట్టగలవు. అది నీకు అనుభవంలోనికి వస్తే నీలో నుండి శాంతి, జ్ఞానము, ప్రేమ ప్రవహిస్తుంది.

భగవాన్ ఎవరో నాకు అక్కరలేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కరలేదు, భగవాన్ ఎందుకో నాకు అక్కరలేదు. ఆయనని కొంతమంది దేవుడు అంటారు, కొంతమంది దేవుడు కాదు అంటారు. కొంతమంది గురువు అంటారు, కొంతమంది గురువుకాదు అంటారు. ఆ గొడవలు అన్నీ నాకు ఎందుకు? ఆయన దగ్గర నుంచి నేను శాంతిని పొందుతున్నాను, కాంతిని పొందుతున్నాను, జ్ఞానాన్ని పొందుతున్నాను. మిగతా గొడవలు నాకు ఎందుకు? ఆయన మాటల ద్వారా ప్రేమ ప్రవహిస్తుంది. ఆయన మాటవేరు, ప్రేమవేరు కాదు. ఆ మాటలోనే ప్రేమ కలిసి ఉంటుంది, ఆ మాటలోనే శాంతి కలిసి ఉంటుంది, భగవాన్ మాటలోనే జ్ఞానం కలిసి ఉంటుంది అన్నారు చలంగారు. మహాత్ములని, మహర్షులని, యోగులని దర్శించుకోవటం వలన మీకు ఒక లాభం ఉంది. మీకు తెలుసున్నా లాభం వస్తుంది, మీకు తెలియకపోయినా లాభం వస్తుంది. మనం తెలుసుండి నిప్పు ముట్టుకున్నా కాలుతుంది, తెలియక నిప్పు ముట్టుకున్నా కాలుతుంది. నిప్పు నిప్పే కదా. ఒక సైంటిస్టు నాస్తికుడు, భగవాన్ దగ్గరికి వచ్చాడు. భగవాన్ గోచీ పెట్టుకొని సోఫాలో కూర్చున్నారు. మీరు ఏ దేశం నుంచి వచ్చారు అని ఏమీ మర్యాదలు చేయలేదు భగవాన్ మౌనంగా ఉన్నారు. ఆ సైంటిస్టు భగవాన్ సమక్షంలో ఒక అరగంట కూర్చున్నాడు. అతను కూడా ఏమీ ప్రశ్నలు అడగలేదు. తరువాత అతను అమెరికా వెళ్ళిపోయాడు. అతను అమెరికాలో ఒక రోటరీ క్లబ్‌లో మాట్లాడుతూ ఏమన్నాడంటే పూర్వం నేను ఏమనుకునేవాడిని అంటే దేహం చనిపోయిన తరువాత మరణానంతర జీవితం ఉండదు అనుకునేవాడిని కాని నేను ఒక మహర్షిని చూసాను. ఆయన నన్ను ఏమీ పలకరించలేదు, నేనూ ఆయనతోటి మాట్లాడలేదు కానీ ఆయన సమక్షంలో నాకు ఒక అనుభవం వచ్చింది.

మనమనోదేహములతోటి సంబంధం లేకుండా, అర్థకామాలతోటి సంబంధం లేకుండా, చావు పుట్టుకలతోటి సంబంధం లేకుండా మన హృదయములో ఏదో ఉంది అని స్ఫురించింది. ఏదో ఉంది, ఆ ఉన్నది నాకు తెలియటం లేదని కూడా తెలిసింది అన్నాడు. అది ఒక మహాజ్ఞానిని, ఒక ప్రేమస్వరూపుడిని దర్శించటం వలన వచ్చిన లాభము అన్నాడు ఆ సైంటిస్టు. మహాత్ములని దర్శించటం వలన ప్రయోజనం ఏమిటి అంటే వాడి హృదయంలో ఒక సత్యం ఉంది అది వాడికి తెలియటం లేదన్న సంగతి తెలుస్తోంది కాబట్టి అక్కడి నుంచి వాడికి తెలుసుకోవాలనే బుద్ధి కలుగుతుంది. ఆత్మజ్ఞానాన్ని సంపాదించటానికి డబ్బు అక్కరలేదు, జ్ఞానాన్ని తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే చాలు, జ్ఞాన సముపార్జనకు అదే పెట్టుబడి అన్నారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-02-2011, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకి సత్యం తెలియకపోవటానికి కారణం మన రూపబుద్ధి, నామబుద్ధి. మన రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి బయటకు రావటానికి చాలాకృషి చెయ్యాలి, కఠినమైన సాధన చెయ్యాలి. సర్వానికీ నారాయణుడే కర్త అయినప్పటికీ తెలియని తనం వల్ల నేనే కర్తని అనుకుంటున్నాము, నేనే కర్తను అనుకున్నంతకాలం, మనిషికూడా నీడ ఎలా వెంటాడుతుందో అలాగ మనిషిని అశాంతి, దుఃఖం వెంటాడుతుంది. ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలోకూడా మనలను అశాంతి, దుఃఖం వెంటాడుతుంది. మనం కొన్ని మంచి పనులు చెయ్యాలి. మనం మంచిపనులు చేయలేకపోయినా ఎవరైనా మంచి పనులు చేస్తూ ఉంటే వారిని చూసి సంతోషించే యోగ్యత మనకి ఉండాలి. అలా సంతోషించే శక్తి లేని మీకా ఆత్మజ్ఞానం అన్నాడు పరమాత్మ. మీరు వందమందికి ఉపకారం చేయలేక పోవచ్చు కనీసం ఒకరికైనా ఉపకారం చేయండి అని రామకృష్ణుడు చెప్పాడు. చదువు వచ్చిన మనిషి ఒక చదువులేని వాడికి చదువు చెబితే, ఒక ధనవంతుడు ఒక పేదవాడికి ఉపయోగపడితే, తెలివితేటలు ఎక్కువ ఉన్నవాడు తెలివితక్కువ వాడికి కొంచెం మాట సహాయం చేస్తే ప్రభుత్వంతోటి సంబంధం లేకుండా సోషలిజం ఈ దేశంలో వచ్చేస్తుంది అన్నారు.

మాకు శాంతిలేదు అని చాలామంది అంటారు. మీకు మమకారం ఉన్నప్పుడు, అహంకారం ఉన్నప్పుడు శాంతి దొరకదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. శాంతిస్థానం దొరకాలి అంటే జ్ఞానమార్గంవల్లే అది తొందరగా సాధ్యమవుతుంది. స్థూలదృష్టి ఉన్నవాళ్ళు ఈ జ్ఞానమార్గంలో

నిలబడలేరు. నీకు సూక్ష్మదృష్టి ఉంటే మనస్సును డైరెక్టుగా కంట్రోలు చెయ్యి. నీకు సూక్ష్మదృష్టి లేకపోతే, నీకు బుద్ధిలో వివేకం లేనప్పుడు నువ్వు శ్వాసమీద ధ్యాస పెట్టవచ్చు. దీనివలన కూడామనస్సు కొంత కంట్రోలులోనికి వస్తుంది. నువ్వు స్థూలబుద్ధితోటి ప్రయాణం చేసినా, సూక్ష్మబుద్ధితోటి ప్రయాణం చేసినా నీకు ఆత్మజ్ఞానం లేకుండా సత్యసాక్షాత్కారం కలుగదు. మీరు ఏ మార్గంలో ఉన్నప్పటికీ ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహారనియమంలేనివాడికి బుద్ధిలో క్లారిటీ రాదు. నీకు బుద్ధిలో క్లారిటీ లేనప్పుడు ఇది నిత్యము, ఇది అనిత్యము, ఇది సత్యము, ఇది అసత్యము అని నువ్వు విభజన చేసుకోలేవు. ఆహారశుద్ధిలో నుండి చిత్తశుద్ధి వస్తుంది. చిత్తశుద్ధిలోనుండి భావశుద్ధి వస్తుంది. భావ శుద్ధి లేకుండా నీకు ఆత్మజ్ఞానము సాధ్యము కాదు. ఆధ్యాత్మిక జీవితానికి ఏమైనా ముగింపు ఉందా లేక ఇలా జపాలు, ధ్యానాలు చేసుకోవటమేనా అని చాలా మంది అడుగుతారు. మనోనాశనం అయితేనే కాని నీలోపల ఉన్న సద్వస్తువు నీకు తెలియబడదు. నీలోపల ఉన్న శాంతి సామ్రాజ్యానికి నువ్వు అధిపతి అయిన తరువాత నీకు అక్కడ ముగింపు ఉంది. ఎందుచేతనంటే నీలోపల ఉన్న శాంతి నీకు అనుభవంలోనికి వచ్చినవెంటనే, దానితో నువ్వు వన్‌నెస్‌ని సంపాదించిన వెంటనే, దానితోటి సమానమైన శాంతికాని, దానికిమించిన శాంతి కాని లేదని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఆధ్యాత్మిక జీవితానికి అది ముగింపే. భగవద్గీతలో దీనికి ముగింపు చెప్పాడు.

**విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః।**

**నిర్మమో నిరహంకారః సశాంతి మధిగచ్ఛతి॥ (2-71)**

మనల్ని కొన్నికోరికలు బంధిస్తాయి, కొన్ని కోరికలు బంధించవు. మనకు పునర్జన్మని తీసుకువచ్చే కోరికలే ప్రమాదం. నువ్వు సాధన చేసి పునర్జన్మలని కలగజేసే కోరికలన్నీ వదులుకోవాలి. నిరహంకారం అంటే అహంకార రహితస్థితి. నిరహంకారస్థితి ఎలా వస్తుంది అంటే అది ఇంపెర్సనల్ బిహేవియర్ వల్ల వస్తుంది. అహంకారం అంటే చాలామంది కోపం అనుకుంటున్నారు. అహంకారం అంటే కోపంకాదు, దేహము పట్ల ఎవడికైతే ఆత్మబుద్ధి ఉందో వాడిని అహంకారి అని పిలుస్తారు. మనం చేసే సాధనలన్నీ నిరహంకారస్థితిని సంపాదించటానికే. మనకి నేను అనే తలంపు ఉన్నప్పుడు నాది అనే తలంపు కూడా ఉంటుంది. మనకి నేను అంటే చైతన్యం స్ఫురించదు, మనకి దేహం స్ఫురిస్తుంది. అప్పుడు ఈ దేహానికి సంబంధించిన వాళ్ళందరూ సిద్ధమవుతారు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి మీకు చాలా

దుఃఖం వచ్చేస్తుంది, మీ పక్కింటి వారు ఎవరైనా చనిపోతే మీకు దుఃఖం రాదు. ఎందుచేత మీ ఇంట్లోవాళ్ళు చనిపోయినప్పడు నాది అనిపిస్తుంది. దేహం నేను అనుకున్నంతకాలం నాది వస్తుంది. ఆ నాదిలోంచి మళ్ళీ దుఃఖం ప్రారంభమవుతుంది. అహంకారం లేనివాడికి మమకారం ఉండదు. అసలు దుఃఖం రావటానికి ఎటాచ్‌మెంటే కారణం. మీరు ప్రశాంతంగా కూర్చోండి. మీకు ఎక్కడా ఇష్టాలు లేవు అనుకోండి, ఎక్కడా అయిష్టాలు లేవు అనుకోండి అప్పడు మీ మనస్సు ఎక్కడైనా చలిస్తుందేమో చూడండి. మీకు ఎక్కడైనా ఇష్టం ఉంటే మీ మనస్సు అక్కడ వాలుతుంది, మీకు అయిష్టం ఉంటే మీ మనస్సు అక్కడ వాలుతుంది. మీకు ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి మీ మనస్సు ఇంక చలించదు.

కొంతమంది చెడ్డమాటలు మాట్లాడుతూ ఉంటారు. చెడ్డపనులు చేస్తూ ఉంటారు, వారికి చెడ్డ ఆలోచనలు వస్తూ ఉంటాయి. వాటి వలన మనకు ఉపయోగం ఉందా? పోనీ అవి ఈ లోకానికి పనికి వస్తాయా, పరలోకానికి పనికి వస్తాయా అంటే అవి దేనికి పనికిరావు. మరి అవసరంలేని మాటలు ఎందుకు మాట్లాడుతున్నారు? మనం పది పనులు చేస్తే ఎనిమిది పనులు అవసరంలేని పనులు చేస్తూ ఉంటాము. ఎందుకు ఇలా చేస్తున్నాము అంటే దానికి మనస్సు యొక్క చాపల్యమే కారణం. అహంకారం తోటి కలిసి నువ్వు తిరుగుతూ ఉంటే నీకు శాంతి ఎలా కలుగుతుంది. అహంకారం ఉంటే మమకారం వస్తుంది. మమకారం ఉన్నప్పడు నీకు శాంతి ఎలా కలుగుతుంది. కొంతమంది నేను ఆ మంచిపని చేశాను, ఈ మంచిపని చేశాను అంటారు. నువ్వు ఏదైనా మంచిపని చేస్తే దాని తాలూకు స్పృహ కూడా ఉండకూడదు, ఎక్కడా నీకు ఆసక్తి పనికిరాదు. నువ్వు ఆసక్తిలోంచి విడుదల పొందకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు శాంతిరాదు. మీరు బంగారపు వస్తువులు మెడలో ఎలా అలంకరించుకుంటున్నారో అలాగ నేను అది సాధించాను, ఇది సాధించాను అని వాడు అనుకుంటూ ఉంటే ఆ నేను తాలూకు స్పృహలో నువ్వు ఎక్కువగా ఉంటే నీ ఈగో డెకరేట్ అయిపోతుంది. అంటే అహంకారం లోపల ముస్తాబు అయిపోతూ ఉంటుంది. అది నీకు తెలియదు. దేహాత్మబుద్ధిపోవటం చాలా కష్టం. దానికోసం ఎంతో సాధన చేయాలి. ఒకవేళ సాధన చేసినా గురువు అనుగ్రహం లేకపోతే, ఈ దేహాత్మబుద్ధిలోనుండి మనిషి విడుదల పొందలేడు.

శారీరక జీవితం, మానసిక జీవితం వీటికి సంబంధించినటువంటి స్పృహలేనివాడిని, అహంకారరహితుడిని, మమకారరహితుడిని మాత్రమే శాంతి వరిస్తుంది. అప్పటివరకూ

నువ్వు సాధనచేస్తూ ఉండవలసిందే. ఎప్పుడైతే ఈగో సెన్స్‌లోంచి నువ్వుబయటకు వచ్చావో అప్పుడు నీకు అందేది లౌకికమైన ఆనందం కాదు, బ్రహ్మానందాన్ని పొందుతావు. మేము దేహగతమైన నేను కోసమే జీవిస్తున్నాము కదా! ఈ నేనుని పోగొట్టుకుంటే ఎలాగండి అని చాలామంది అనుకుంటారు. ఎంతసేపు ఆ నేనుతోనే కలిసి జీవిస్తాడు కదా, అందుచేత ఆ నేను పోతే వాడు పోతాను అనుకుంటాడు. ఆ నేను పోతే వాడు పోడు, వాడు ఎవడో వాడికి తెలియబడుతుంది. దానినే బ్రాహ్మీస్థితి అంటారు. అది మొదలు, చివర లేని పరమస్థితి. ఇక్కడ పరమాత్మ ఏమని చెబుతున్నాడు అంటే నీ దేహం ఈ భూమిమీద తిరుగాడుతున్నప్పడే ఆ బ్రాహ్మీస్థితిని పొందితే మంచిదే కాని ఇప్పడు నువ్వు పొందలేవు అనుకో నీశరీరం పోయే టైముకి అయినా నువ్వు కష్టపడి సాధనచేసి, సాధనచేసి అంత్యకాలంలో, నీ ప్రాణంపోయే టైములో అయినా బ్రాహ్మీస్థితిని నువ్వు పొందగలిగితే నువ్వు మోక్షసుఖాన్ని పొందుతావు, అప్పడు ఇంక నీకు పునర్జన్మలేదు. మీ శరీరం చనిపోయేటప్పడు మీరు పూర్తిగా ఆనందంగా ఉన్నారా? లేదా? చూసుకోండి. అంటే బాహ్యపరిస్థితులతోటి సంబంధం లేకుండా, మీ కుటుంబ పరిస్థితులతోటి సంబంధం లేకుండా, మీదేహ ప్రారబ్ధంతోటి సంబంధం లేకుండా మీ ప్రాణప్రయాణ టైములో మీరు నూటికి నూరుపాళ్ళు బ్రహ్మానందంలో ఊగిసలాడుతూ ఉంటే వాడికి పునర్జన్మలేదు అర్జునా అన్నాడు పరమాత్మ.

**తేజః క్షమాధృతి శ్శౌచం, అద్రోహూ నాతిమానితా**

**భవన్తి సమ్పదం దైవీ మభిజాతస్య భారత**

మనభారతదేశంలో జన్మించినటువంటి మహావీరులలో అర్జునుడు ఒకడు. అటువంటి అర్జునుడినే పరమాత్మ భవసవ్యసాచిన్ అన్నాడు. అంటే నువ్వు ఊరికే చేతులు ఆడించు, పని అంతా నేను చూసుకుంటాను అన్నాడు. పని అంతా నాది గౌరవం నీకు అన్నాడు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెబుతున్నాడు. తేజః అంటే తేజస్సు. మహాత్ములు, మహర్షులు, యోగుల దగ్గరికి వెళ్ళిచూస్తే మీకు వారి ముఖంలో తేజస్సు తెలుస్తూ ఉంటుంది, ఆనంద ప్రభావం ఆ ముఖంలో కనిపిస్తూ ఉంటుంది. మనం స్నో రాసుకోవటం వలన, పౌడరు రాసుకోవటంవలన తెచ్చుకొనే తేజస్సు కాదు అది. సాధన వలన వైరాగ్యం వలన, యోగం వలన, జ్ఞానం వలన నీకు కొంత తేజస్సు కలుగుతుంది. ఆ తేజస్సు కలవారి దగ్గరకు వెళ్ళి నువ్వు కూర్చుంటే ఆ తేజస్సు నీకు స్పష్టంగా

కనిపిస్తూ ఉంటుంది. మన సాధనతోటి సంబంధం లేకుండా గౌతమ బుద్ధుడు ముఖంలో ఉన్న ఆ తేజస్సు చూసి 150 మంది ఆత్మజ్ఞానం పొందారు అని చెబుతారు. బుద్ధుడు సవతి తమ్ముడు ఆనంద్ మాత్రం ఆ తేజస్సు యొక్క ప్రభావం వలన బ్రాహ్మీస్థితి పొందలేకపోయాడు. దానికి కారణం ఏమిటంటే బుద్ధుడు మన అన్నగారు అనే భౌతిక దృష్టి ఆయనకు పోలేదు. ఆ ఎటాచ్‌మెంట్ పోగొట్టుకోలేకపోయాడు. అందుచేత ఆనంద్ ఆ తేజస్సును పొందలేకపోయాడు.

క్షమ అంటే ఓర్పు, సహనము. వారు ఏదో అన్నారని నేను ఏదో అనేశాను అని మాటకి మాట అందించేయటం అక్కరలేదు. నీకు సహనం పెరగాలి. సహనం ఉన్నవాడికి ఎంతో కొంత హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, సహనం లేనివాడికి హృదయం యొక్కలోతులు పెరగవు. మనకి క్షమ ఉండాలి, ధైర్యం ఉండాలి. దైవీ సంపదకి నాయకుడు ధైర్యం అన్నారు. మనల్ని అవమానపరచే వాళ్ళు ఉన్నా మనం సహనం పోగొట్టుకో కూడదు. మీకు యాక్షన్ ఉండాలి కాని రియాక్షన్ ఉండకూడదు. మీరు ఇన్‌సల్ట్‌ని బేర్ చేయలేనప్పుడు మీకు తూకం ఎలా పెరుగుతుంది. తూకం పెరగదు. మనిషికి తూకం పెరగాలంటే సాధన చెయ్యాలి, ఇమ్‌పెర్సనల్ లైఫ్ ఉండాలి. మన బిహేవియర్ ఇమ్‌పెర్సనల్‌గా ఉండాలి. అప్పుడు ఆమనిషి తూకం పెరుగుతుంది కాని కేవలం పాండిత్యంవల్ల, ధనంవల్ల హృదయం యొక్క లోతులు పెరగవు. శౌచం అంటే శుచిగా ఉండాలి. లోపల శుచి ఉండాలి. బయట శుచి ఉండాలి. నీ శరీరాన్ని సబ్బుపెట్టి తోముకుని ఎలా శుచిగా ఉంచుకుంటున్నావో అలా భగవంతుడిని స్మరించటం వలన, ప్రార్ధన చేయటం వలన నీ మనస్సుకి శుచి కలుగుతుంది. భగవంతుడిని మన కళ్ళతో చూడలేకపోయినా భగవంతుడి నామం మనం వింటున్నాము. ఆ నామాన్ని మనం శ్రవణం చేయటం వలన, మననం చేయటం వలన మనకి మానసికంగా భగవంతుడితో అనుబంధం కలుగుతుంది. భగవంతుడితో ఎప్పుడైతే అనుబంధం కలిగిందో అప్పుడు భగవంతుడిని తెలుసుకోవాలనే జిజ్ఞాస మనకు పెరుగుతుంది . మహాత్ముల దర్శనం ఎందుకు చెయ్యాలంటే వారిని దర్శనం చేయటం వలన మనలో ఏదో ఉంది, దానిని తెలుసుకోవాలిఅనే కాంక్ష మనకు కలుగుతుంది. జ్ఞానానికి పెట్టుబడి ఐశ్వర్యం కాదు, జ్ఞానానికి పెట్టుబడి తెలుసుకోవాలనే కాంక్ష ఉండాలి. అద్రోహః ఎవరికి ద్రోహం తలపెట్టకు. మనం ఎవరికైనా ద్రోహం చేస్తున్నాము అంటే మనకి మనమే ద్రోహం చేసుకుంటున్నాము అని మరిచిపోకండి. అంటే మనం చేసిందంతా తిరిగి

మనకే వస్తుంది. మీరు ఎవరినీ ఆక్షేపించకండి. మీరు ఎవరినైతే ఆక్షేపించారో మళ్లీ వాళ్లచేతే మీరు ఆక్షేపింపబడతారు. అది దేవుడి చట్టం.

**నఅతిమానితా :** ప్రజలందరూ నన్ను గొప్పవాడని చెప్పకోవాలి, నాలో ఏమీ విశేషం లేకపోయినా నాలో ఏదో విశేషం ఉన్నట్లు ప్రజలందరూ చెప్పకోవాలి, అందరూ నన్ను పూజించాలి, నాకు సన్మానాలు చెయ్యాలి అని ఇటువంటి లక్షణాలన్నీ ధనంలోంచి వస్తాయి. నువ్వు ఇద్దరికి ఒకేసారి పాలేరుతనం చేయగలవా అన్నాడు ఏసు. ఇటు జ్ఞానానికి, అటు ధనానికి రెండింటికి ఒకేసారి నువ్వు పాలేరుగా ఉండగలవా అన్నాడు. ధనం వచ్చినవాడికి మదం వస్తుంది. సూది బెజ్జంలోంచి ఒంటెని పంపవచ్చుగాని, ధనవంతుడిని స్వర్గరాజ్యం లోనికి పంపలేము అని ఏసు చెప్పాడు. నన్ను అందరూ గౌరవించాలి అనే బుద్ధి ఉండకూడదు, ఇవన్నీ ఆత్మజ్ఞానం పొందటానికి అడ్డంకులు. త్యాగం అంటే మీరు ఎవరికో పదిరూపాయలు ఇవ్వటం త్యాగం కాదు, ఎవరికో ఒక మాట సహాయం చెయ్యటం త్యాగం కాదు. ఇవి బాహ్యవిషయాలు మీకు జ్ఞానం సంపాదించటానికి మీ లోపల ఏ విషయాలు అడ్డు వస్తున్నాయో చూసుకోండి, మన మనస్సు బాహ్యముఖం అవ్వటానికి కారణాలు ఏమిటి? మన మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటి? అని మీరు పరిశీలన చేసి చూసుకుంటే మీకు కొన్ని అయినా తెలుస్తాయి. వాటిని మీరు విడిచిపెట్టగలగటమే నిజమైన త్యాగం. మనం ఏదైనా తినేటప్పడు ఇది సరిపోతుంది అని దేహం చెబుతుంది. కాని దేహం చెప్పినా ఇంకా తినేస్తూ ఉంటాము. అది రోగానికి కారణం అవుతుంది. దేహం సరిపోతుంది అని చెప్పినప్పడు ఆ తిండి ఆపు చెయ్యటం కూడా త్యాగమే. నువ్వు ఆ రుచిని విడిచిపెట్టగలగాలి. బ్రాహ్మీస్థితి పొందటానికి ఏ విషయం అడ్డువచ్చినా దానిని నువ్వు మెర్సిలెస్‌గా విడిచిపెట్టటం నిజమైన త్యాగం.

**దయా భూతేషు అలోలత్వం :** నీ ఇంద్రియాలకు ఎన్ని ఆకర్షణలు ఉండాలో అన్ని ఆకర్షణలు ఎదురుగుండా ఉన్నప్పటికీ వాటిచేత నువ్వు ఆకర్షించబడకుండా, నువ్వు నిర్వికారంగా ఉండగలిగితే అది దైవీసంపద. ఆ దైవీసంపదను దేవుని అనుగ్రహం లేకుండా నువ్వు పొందలేవు. జ్ఞానసముపార్జనకి నీ మనోనిగ్రహం, నీ ఇంద్రియనిగ్రహం సహకరించాలి. మీ మనస్సు, మీ ఇంద్రియాలు మీ స్వాధీనములో ఉన్నాయి అనుకోండి ప్రపంచంలో ఉన్న జనం అందరూ మీకు శత్రువులు అయినా మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మీరు ఏ చింతలేకుండా హాయిగా బ్రతకగలరు. ఇది గుర్తుపెట్టుకోండి. అర్జునా నువ్వు బాగుపడటానికి

నీమనస్సే కారణం, నువ్వు పాడైపోవటానికి అయినా నీమనస్సే కారణం. నీమనస్సుని నువ్వు విరోధిగా చేసుకోకు, నీమనస్సుని నువ్వు స్నేహితుడిగా చేసుకో. చేప నీటికి ఎదురు ఈదుతూ ఉంటుంది, అలాగే ఏ విషయాలు అయితే నీమనస్సుని బాహ్యముఖం చేస్తున్నాయో వాటికి ఎదురీదు. మనస్సుకు ఎదురు ఈదటం నేర్చుకుంటే మనస్సు ఎక్కడ నుంచి వస్తుందో నువ్వు అక్కడికి వెళ్ళిపోతావు అన్నాడు పరమాత్మ. భగవంతుడు నీకు ఏది కేటాయిస్తే దానితోటి సంతృప్తిపడి నీపని నువ్వు చేసుకుంటూ ఉండు. నీదికానిది ఆశించకు. ప్రపంచంలో కనిపిస్తున్న సంపద అంతా ఈశ్వరుడిదే. ఆ ఈశ్వరుడి సంపదే నాది అనుకొని నువ్వు మళ్ళీ దాట్లోంచి పేరు ప్రఖ్యాతులు ఆశిస్తున్నావు దీనికి భగవాన్ అన్నారు ఒకడు మొత్తం బెల్లంతోటి వినాయకుడిని చేశాడు. వాడికి నైవేద్యం పెట్టటానికి ఏమీ లేదు. అప్పుడు వాడు ఏమి చేశాడు అంటే ఆ వినాయకుడిని పట్టుకుని గట్టిగా గిల్లేశాడు, కొంత బెల్లం బయటకు వచ్చింది దానినే నైవేద్యం కింద పెట్టి పూజ చేసేశాడు. మనం చేసేది కూడా అంతే. సంపద అంతా ఈశ్వరుడిదే, ఈశ్వరుడి సంపద ఈశ్వరుడికి సమర్పించి నేను ఇచ్చాను అనుకుంటున్నావు. నీ అజ్ఞానం వల్ల నేను ఇచ్చాను అనుకుంటున్నావు. అసలు నువ్వు ఉన్నావా ఇవ్వటానికి అన్నారు భగవాన్.

ఆలోచన, మాట, చేత, మూడూ నిదానంగా ఉన్నవాడే జ్ఞానసముపార్జనకి యోగ్యత సంపాదిస్తాడు. అంత మాత్రంచేత జ్ఞానం వస్తుందని కాదు. సత్యము కూడా తింగరతనంగా చెప్పకూడదు, హితవుగా చెప్పాలి, భాష మృదువుగా ఉండాలి. నువ్వు ఎవరికైతే చెబుతున్నావో వాళ్ళ క్షేమంకోరి చెప్పాలి కాని నోటికి వచ్చినట్లు చెప్పకూడదు. దయాభూతేషు అంటే అన్ని భూతాలపట్ల దయ కలిగి ఉండాలి. రమణమహర్షిగారి దయ మనుషులకి పరిమితం అవ్వలేదు. జంతుజాలం వరకు వాళ్ళ ప్రేమ వ్యాపించింది. దానికి హద్దులు లేవు. జ్ఞానియొక్క శాంతి, జ్ఞానియొక్క ప్రేమ కొండలని దాటుతుంది, నదులని దాటుతుంది, సముద్రాలని దాటుతుంది, ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. అదే నిజమైన ప్రేమ.

మీకు మీగ్రామం మీదే ప్రేమ ఉంది అనుకోండి లేకపోతే మీదేశం మీదే ప్రేమ ఉంది అనుకోండి, మీకు ఇంక ఎక్కడా ప్రేమ, ఆప్యాయత, ఇష్టం లేదు అనుకోండి అది నూటికి నూరుపాళ్ళు అహంకారం. మీకు ఏమైనా చెడ్డ తలంపులు వస్తూ ఉంటే మిమ్మల్ని చూచి మీరే సిగ్గుపడండి. ఇటువంటి ఆలోచనలు వస్తున్నాయి ఏమిటి, ఇటువంటి పనులు చేస్తున్నాను

ఏమిటి, ఇటువంటి మాటలు మాట్లాడుతున్నాను ఏమిటి అని మీ జీవితాన్ని మీరు పరిశీలన చేసుకోండి. మనస్సులో చపలత్వం లేకుండా చూచుకోండి, చపలత్వాన్ని నిగ్రహించుకోండి, మీకు చపలత్వం తగ్గిపోతే ఉపయోగంలేని తలంపులు, ఉపయోగంలేని మాటలు, ఉపయోగంలేని చేష్టలు అన్నీ తగ్గిపోతాయి. వీటన్నింటికి కారణం మనస్సే. బైబిల్‌లో ఒకమాట ఉంది మీదేహం ఆరోగ్యంగా ఉండటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు, మీ దేహాన్ని శుచిగా ఉంచటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు కానీ మీదేహం చనిపోయాక మీకూడా వచ్చే మనస్సుని బాగుచేసుకోవటానికి దానిని పరిశుద్ధం చేసుకోవటానికి కొంచెము కూడా మీరు ప్రయత్నం చెయ్యరా? మీ మనస్సు పరిశుద్ధముగా ఉంటే అది బ్రాహ్మీస్థితిని పొందటానికి మీకు సహాయ సహకారములు అందిస్తుంది. మీ మనస్సుని పవిత్రం చేసుకోవటానికి కనీసం మీ దేహానికి ఇచ్చే విలువ కూడా మీ మనస్సుకి ఇవ్వరా అన్నాడు ఏసు.

భగవంతుడు రూపాన్ని ధ్యానం చేయటం వలన, ఆ నామాన్ని స్మరించుకోవటం వలన మన రూపబుద్ధికి, మన నామబుద్ధికి దూరం అవుతూ ఉంటాము. ఇంక నువ్వే ఉన్నావు, నేను లేను అనే బుద్ధి కలుగుతుంది. మనం ఇష్టదైవాన్ని స్మరించటంవల్ల ఆ ఇష్టదైవమే సర్వస్వం అనికాదు. ఇష్టదైవం ద్వారా మనం బ్రహ్మములో ప్రవేశిస్తాము. మనం అన్ని గ్రంధాలు చదవకూడదు. మనకి బ్రాహ్మీస్థితి పొందటానికి అనుకూలమైనటువంటి గ్రంధాలు చదవాలి. రాత్రి నిద్రపోయేముందు అందరూ మీ ఇష్టదేవతను స్మరించుకోండి, ఆ స్మరణ నిద్దట్లో కూడా మీకు జరుగుతూ ఉంటుంది. భగవంతుడి నామం ద్వారా కూడా మనం భగవంతుడిని పొందవచ్చు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-03-2010, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆచార, విచార, ప్రచార వీటి గురించి మన సాంప్రదాయంలో చెపుతారు. ఆచారం ఉన్నవాడే ఆచార్యుడు. ఆచారం అంటే క్రమశిక్షణ ఉండాలి. గురువుకి ఆచార్యుడి లక్షణాలు ఉండనక్కరలేదు కాని ఆచార్యుడికి గురువులక్షణాలు ఉండాలి. రామకృష్ణుడు, రమణుడు వీరు గురువులు. శంకరుడు, రామానుజుడు, మధ్వుడు వీరు ఆచార్యులు. గురువులు వారి అనుభవాన్ని చెపుతారు. వారి అనుభవానికి వేదానికి సరిగ్గా బంగారం తూచినట్లుగా సరిపోతుంది. ఆచార్యుడు అంటే గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు తీసుకుని సబ్జక్టు

చెపుతూ ఉండాలి, వారిని అనుగ్రహించాలి. అనుగ్రహ ఆశీస్సులు గురువు ఇవ్వాలి, ఆచార్యుడు ఇవ్వాలి. అనుగ్రహం వల్లే భక్తులకు అన్నీ వస్తాయి. విచార అంటే ఆత్మవిచారణ చెయ్యాలి. త్రికరణశుద్ధిగా ఆత్మవిచారణ చెయ్యాలి. ఆచారం లేకుండా, విచారణ లేకుండా ప్రచారం చెయ్యటానికి పనికి రాడు. ఆచార, అధ్యయన, ప్రవచనం ఇదొక పద్ధతి. ఆచారం ముఖ్యంగా ఉండాలి. శాస్త్రాన్ని బాగా అధ్యయనం చెయ్యాలి. అప్పుడు తరువాత ప్రవచనం. రమణుడు, రామకృష్ణుడు వారి దగ్గరకు వచ్చిన వారికి నాలుగు మాటలు చెప్పేవారు. సత్యాన్వేషణ లేని వారికి, అర్హత లేనివారికి చెప్పినా అంత ప్రయోజనం ఉండదు.

శ్రవణ సాధన అంటే ఇప్పుడు మీరు సబ్జక్టు శ్రవణం చేస్తున్నారు. ఇది కూడా సాధనే, ఏదో కాలక్షేపానికి శ్రవణం చెయ్యకూడదు. శ్రవణం చెయ్యటం కూడా సాధనలో ఒక భాగంగా చేస్తే అది మీకు ఫలిస్తుంది. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారు మంచి పనులు చేయరు, మంచి మాటలు మాట్లాడరు, వారికి మంచి ఆలోచనలు రావు, ఎదుటి వారికి వచ్చిన కష్టమే, ఎదుటి వారికి వచ్చిన నష్టమే వారికి ఆనందం. అక్కడ అంతఃకరణం ఉండదు, హృదయం ఉండదు. ఇలా అంతఃకరణం లేని ఆనందం, హృదయం లేని ఆనందం పొందేవారు గురువుగా ఉండటానికి పనికిరారు. ఎదుటివాడికి కాలు విరిగితే వీడికి ఆనందం, ఎవరైనా పాడైపోతే వీడికి ఆనందం. ఇటువంటి వాళ్ళకి అధ్యయనం ఉన్నా, పాండిత్యం ఉన్నా గురువుగా ఉండటానికి పనికిరాడు. కొంతమందికి ఒక వ్యక్తిమీద ఇష్టం ఉంటుంది, ఇంకొక వ్యక్తిమీద అయిష్టం ఉంటుంది, ఒక ప్రాంతంమీద ఇష్టంఉంటుంది, ఇంకొక ప్రాంతంమీద అయిష్టంఉంటుంది. ఇలా రాగద్వేషాలతో నిండిన హృదయం కలవాడు ప్రవచనానికి పనికిరాడు. అమృతస్థితిని ప్రసాదించే శక్తి గురువుకి ఉండాలి. గురువు పరిశుద్ధుడు అయితే, అనుగ్రహ ఆశీస్సులు ఇవ్వగలిగితే త్రిమూర్తులు చేసేపని గురుమూర్తే చేస్తాడు. మీకు సద్గురువు దొరికితే త్రిమూర్తులు అక్కరలేదు గురుమూర్తే సరిపోతాడు, ఆయనే నిన్ను గమ్యానికి చేరుస్తాడు. పాలమూరులో పెద్ద మంచినీళ్ళ చెఱువు ఉంది అనుకోండి. ఆ చెఱువులో ఉన్న నీరు అంతా మీరు ఏమిచేసుకుంటారు. చెఱువులో ఉన్ననీరు మీ ఇంటికి ట్యాప్ ద్వారా వస్తాయి. చెఱువులో ఉన్ననీరు అంతా ఈశ్వరుడు అయితే గురువు ట్యాప్ లాంటివాడు. మీ ఇంటిలో ఉన్న ట్యాప్‌లో మీకు కావలసిన నీరు పట్టుకొంటారు అంటే మీకు కావలసిన నీరు అందిస్తాడు అంటే మీ దాహం తీర్చటానికి గురువు సరిపోతాడు.

చాలామంది మనుషులకు జ్ఞానం సంపాదించాలనే అపేక్ష ఉండదు, అంటే వారికి జిజ్ఞాస ఉండదు. బ్రహ్మం పట్ల మీకు జిజ్ఞాసను కలుగజేసి, దానిని తెలుసుకోవాలనే బుద్ధిని కలుగజేసేవాడే గురువు. మీరు ఎన్ని విద్యలు నేర్చుకున్నా ఆ విద్యల యొక్క గమ్యం జ్ఞాన సముపార్జన. మీరు బాగా ధనం సంపాదిస్తే మీరు ధనవంతులు అని ఇతరులు అంటూ ఉంటే మీకు ఆనందం వస్తుంది, మీకు ఏదైనా అధికారం వస్తే ఆనందం వస్తుంది, మీకు బాగా పాండిత్యం ఉంటే మీరు గొప్ప పండితులు అని అందరూ అంటూ ఉంటే మీకు ఆనందం వస్తుంది. ఇవన్నీ నిలబడేవి కాదు, ఇవన్నీ పిశాచాలకు సంబంధించిన ఆనందాలు, ఇవన్నీ ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే గొడవలు. మీ దేహప్రారబ్ధాన్నిబట్టి ఇవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మీకు పదిమంది ఓటు వేస్తే అధికారం రావచ్చు, మీరు చేసినదల్లా కలిసివస్తే మీరు ధనవంతులు అవ్వవచ్చు, మీకు చదివింది వంటబడితే పండితులు అవ్వవచ్చు. ఇవన్నీ బాహ్యవిషయాలు. ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మానందం రాదు. మీరు ఎంత చదివినా, పొట్టకోసం ఏ వృత్తిలో ఉన్నా ఆత్మజ్ఞానసముపార్జనే గమ్యంగా పెట్టుకోవాలి.

దేహం పోతే నేను పోతాను అనుకోవటం అది ఒక తలంపు. ఆ తలంపు దేహము నేను అనే తలంపులో నుండి వస్తోంది. అందుచేత ఆ మొదటి తలంపు పోయేవరకూ ఈ తలంపు పోదు. అరుణాచల అష్టకంలో ఏమన్నాడు అంటే ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు కొండరూపంలో ఉన్నావు. నిన్ను చూసే నేను ఇక్కడ ఉన్నాడు కదా, నువ్వు ఎవడవు అని వాడిని ప్రశ్నించుకొంటే వాడు నెమ్మదిగా హృదయంలోనికి జారిపోయాడు. అంటే ఏ మనస్సు అయితే మనకు నేనుగా వ్యక్తమవుతోందో ఆ మనస్సు హృదయంలోనికి జారిపోయిన తరువాత అది కనిపించకుండా పోతుంది. అప్పుడు చూసేవాడు లేడు, చూడబడేది లేదు. ఈ నేను అనే తలంపుకు ఆధారంగా ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చినప్పుడు అంతా తానుగానే వ్యక్తమవుతుంది. చేను బాగా ఎదగాలంటే కలుపు మొక్కలు ఉండకూడదు. మీరు జ్ఞానం కోసం ప్రయత్నం చూస్తూ ఉంటే పూర్వజన్మల అలవాట్లు, గుణాలు కలుపుమొక్కల కింద వచ్చేస్తూ ఉంటాయి. చేనుకు ఎరువు పెట్టినప్పుడు ఎరువు అంతా కలుపుమొక్కలు లాగేస్తాయి. అందుచేత ఆ కలుపుమొక్కలు తీసే బాధ్యత కూడా గురువే పెట్టుకొంటాడు. చావులు పుట్టుకలు, లాభనష్టాలు, గౌరవాలు అగౌరవాలు ఇవి అన్నీ వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, ఇవి ఏమీ నిజంకాదు. ఇవి అన్నీ ఒక మహాస్వప్నంలో జరిగిపోతున్నాయి. ఆ

స్వప్నంలో నుండి మిమ్మల్ని మేల్కొలిపేవాడు ఒక్క గురుమూర్తి మాత్రమే. ఈ స్వప్నంలో నుండి బయటకు రావటానికి మీ తెలివితేటలు సరిపోవు, మీ సాధన సరిపోదు. అందులో నుండి మేల్కొలిపి జ్ఞానం వైపుకు కళ్ళు తెరిపించేవాడు ఒక్క గురుమూర్తి మాత్రమే.

గురువు అంటే అక్కడ శరీరం కాదు. గురువు అంటే ఆత్మ. ఆత్మ మన హృదయంలోనే ఉంది. మనలను లోపలకు పంపటంకోసం మనలో ఉన్న ఆత్మే గురురూపంలో వచ్చింది. ఒకవేళ ఈ శరీరంలో ఉండగా మనస్సు పక్వానికి రాకపోతే అప్పుడు జ్ఞానాన్ని ఇస్తే తట్టుకోలేరు కాబట్టి అదనంగా మరో జన్మను యిచ్చి మీ మనస్సును ప్రిపేర్ చేసి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు అంతేగాని మధ్యలో మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు నిజమైన గురువు. గురువు అనుగ్రహంలో మీరు పడితే మీరు ఏ జన్మలో ఉన్నా మీకు అమృతానుభవం కలిగే వరకూ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మీకు అద్వైతవాసన కలగాలి అంటే సజ్జన సాంగత్యం ఉండాలి, అధ్యయనం ఉండాలి, విచారణ ఉండాలి, ఏకాంతవాసం కూడా మీకు కొంత అవసరం. ఏకాంతవాసంలో మీ మనస్సులో ఏముందో అంటే దైవసంపద ఉందా? అసురసంపద ఉందా? అనేది మీకు తెలుస్తూ ఉంటుంది, ఏకాంతవాసం స్కానింగ్ లాంటిది. గురువు యొక్క మౌనం మిమ్మల్ని పవిత్రం చేస్తుంది, మౌనం అంటే నోరుమూసుకుని కూర్చోవటం కాదు. మనస్సు ఎక్కడైతే పూర్తిగా అణిగిందో అక్కడనుండి మౌనం వస్తుంది. మౌనం విరామంలేని సంభాషణ. మౌనం మీకు బోధిస్తూ ఉంటుంది. అయితే మీ మనస్సుకు దానిని రిసీవ్ చేసుకొనే శక్తి లేనప్పుడు మౌనం లాభంలేదు, అప్పుడు నాలుగు మాటలు చెప్పవలసి ఉంటుంది. గురువుతో మానసిక అనుబంధం గురువుతో సంభాషణ, గురువు యొక్క చూపు, గురువు యొక్క ప్రెజెన్స్ ఇవి అన్నీ మీకు జ్ఞానోదయం కలుగజేస్తాయి. అయితే శ్రవణ సాధన చేసేవారిలో పవిత్రత ఉండాలి. ఏకాగ్రత ఉండాలి. మనకు ఏకాగ్రత కుదరాలి అంటే జరిగిపోయిన గొడవలు పూర్తిగా మరిచిపోవాలి, భవిష్యత్ గురించి అస్తమాను ఊహించకూడదు. భవిష్యత్‌ను, భూతకాలాన్ని మరిచిపోయి ఎవడైతే వర్తమానకాలంలో జీవించటం నేర్చుకొన్నాడో, చేతిలో ఉన్న పనిమీద ఎవడైతే మనస్సు పెడుతున్నాడో వాడికి మాత్రమే ఏకాగ్రత కలుగుతుంది. వర్తమానకాలాన్ని పాడుచేసు కుంటూఉంటే నీకు ఏకాగ్రత కలుగదు. ఏకాగ్రత కలగాలి అంటే విగత జ్వరః అంటే జ్వరం రాకుండా చూసుకోండి. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకుంటూ ఉంటే మనస్సుకు జ్వరం వచ్చేస్తుంది. నీకు జ్వరం తగ్గాలంటే జరిగిపోయిన గొడవలు మరిచిపోవాలి.

మేము భోగాల మధ్యన ఉన్నాము, మేము సుఖపడిపోతున్నాము అని యిలా అనుకొంటూ ఉంటారు. డబ్బు ఎక్కువ అయ్యి మీరు భోగాలు అనుభవించటం మొదలుపెడితే చివరకు రోగాలు మిగులుతాయి. భోగాలవలన పరిణామంలో రోగాలు వస్తాయి. చివరకు ఈ భోగ ప్రవృత్తి మీ మనస్సును అంతర్ముఖం అవ్వనివ్వదు. ఒకవేళ మీకు అన్నీ అనుకూలమైన పరిస్థితులు ఉంటే ఉండనివ్వండి కాని అందులోనుండి ప్లెజర్ తీసుకోవద్దు. మీకు అనుకూలమైన పరిస్థితులు లేకపోతే వాటిలోనుండి పెయిన్ తీసుకోవద్దు. ఈ ప్రక్కనుండి పెయిన్ తీసుకున్నా, ఆ ప్రక్కనుండి ప్లెజర్ తీసుకొన్నా మనస్సుకు జ్వరం వచ్చేస్తుంది. అందుచేత మనస్సుకు జ్వరం రాకుండా చూసుకోండి. మీ శరీరానికి జ్వరంవస్తే అది ఎలా పనిచేయలేదో అలాగే మీ మనస్సు జ్వరంతో కాలిపోతూ ఉంటే అది సాధనకు పనికిరాదు, విచారణకు పనికిరాదు, మీ మనస్సు ఎందుకు పనికిరాకుండా పోతుంది. మీరు లోకంలోని గొడవలు అన్నీ స్మరించుకొంటున్నారు మరి నన్ను ఒక్కడినే వదిలేస్తారా అంటున్నాడు పరమాత్మ. మీరు దేనినైతే స్మరిస్తున్నారో అవి అన్నీ స్వప్నమే కదా. అది తెలియకపోవటం వలన నన్ను స్మరించటం మానేసారు. మీకు నామీద ఇష్టంలేదు కాబట్టి నామీద మీకు ధ్యాస రావటం లేదు. ధ్యాస లేకపోతే ధ్యానం రాదు.

గురువు యొక్క మౌనం మనస్సు ముగ్గినవారికే తెలుస్తుంది. మౌనాన్ని అందరూ అర్థం చేసుకోలేరు కాబట్టే గురువు నాలుగుమాటలు చెపుతాడు. సత్యం మాటలకు అతీతం, సంకల్పానికి అతీతం, ఊహలకు అతీతం. అయితే గురువు ఏమిచేస్తాడు అంటే దానిని ఎంతవరకు మాటలలో చెప్పగలడో అంతవరకు చెపుతాడు. ఆ మాటల ద్వారా నిన్ను అనుగ్రహించి సత్యం అనుభవంలోనికి వచ్చేటట్లు చూస్తాడు. గురువు యొక్క సహవాసం ఎందుకంటే గురువు సన్నిధిలో నీకు జ్ఞానం సంపాదించాలనే కాంక్ష కలుగుతుంది. ఇంటి దగ్గర నువ్వు ఏ పరిస్థితులలో ఉన్నా గురువు సన్నిధిలో అసలు వాతావరణమే మారిపోతుంది. గురువు సమక్షంలో ఉన్నప్పుడు నువ్వు బాహ్యమైనగొడవలు అన్నీ మరిచిపోయి, నీ లాభనష్టాలను అన్నీ మరిచిపోయి ఒక ప్రశాంత స్థితిని పొందుతావు. గురువు దగ్గర అనుగ్రహం తప్పించి ఏమీ ఉండదు. గురువు ఎప్పుడైనా నిన్ను ఆగ్రహించినా అది కూడా అనుగ్రహమే. గురువు ఆగ్రహం కూడా అనుగ్రహమే అని గ్రహించినవాడు ధన్యుడు. గురువు యొక్క సన్నిధిలో వాతావరణం మారిపోతుంది, నీ తలంపులోనే మార్పు వస్తుంది, జ్ఞానం పొందాలి అనే కుతూహలం, జ్ఞానం పట్ల అపేక్ష, ఆ జిజ్ఞాస పెరుగుతుంది. గురువు యొక్క సన్నిధిలో

మనం పొందే లాభం అది.

మీరు సాధన చేసేటప్పుడు ఎప్పుడైనా ఆత్మ స్ఫురించినా పూర్తిగా వాసనాక్షయం అయ్యే వరకు అది నిలబడదు. మీకు అనేక వాసనలు ఉండవచ్చు కాని వాటికి మూలం దేహం, లోకం, శాస్త్రం ఈ మూడింటిలో ఏదో ఒకటి అవుతుంది. కొంతమంది వారికి ఉన్న పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొంటారు. కొంతమంది లోకవిచారణ చేస్తూదానినే ఆత్మ విచారణ అనుకొంటారు. ఈ లోకవాసనకంటే, శాస్త్రవాసన కంటే, దేహవాసన చాలా బలీయమైనది. గురువు అనుగ్రహం లేకుండా మనం దేహవాసనలో నుండి బయటకు రాలేము, మీ తెలివితేటల వలన అది సాధ్యం కాదు. దేహవాసన నశిస్తేనే గాని మీకు ఆత్మ జ్ఞానం స్థిరపడదు. ఆత్మశాంతికి హద్దులు లేవు, పరిమితులు లేవు. అది దేహంలో ఉన్నట్లే నీకు స్ఫురించినా ఆ దేహానికి పరిమితమై ఉండదు. అందుచేత ఈ భౌతిక దేహం దగ్గర కూర్చున్న మీ నలుగురే కాదువయ్యా జ్ఞానానికి వారసులు, ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వాడికి జిజ్ఞాస ఉంటే, వాడు సత్యాన్వేషకుడు అయితే, వాడికి సహృదయం ఉంటే నేను పొందిన జ్ఞానంలో వారు ఏ దేశంలో ఉన్నా కూడా వారు వారసులే అన్నారు భగవాన్. కేవలం దేహ సంబంధం ఉన్నవారు కాదు వారు ఎక్కడ ఉన్నా వారికి సద్బుద్ధి ఉండాలి, సహృదయం ఉండాలి, సత్యాన్వేషణ ఉండాలి. మనందరం భక్తులమే కాని అసలు సత్యాన్వేషణ మనకు లేదు. ఏవో బయట గొడవలకు పరిమితమై ఉంటాము. మీకు కడుపునొప్పి వస్తోంది అనుకోండి, కడుపునొప్పి తగ్గించేలా చూడు అంటారు అంతేగాని మనకు జ్ఞానం అక్కరలేదు, మోక్షం అక్కరలేదు. భక్తులకు కూడా వ్యాపారలక్షణాలు ఉంటాయి. వ్యాపారలక్షణాలు ఉంటే మీ భక్తి కోరికకు పరిమితమైపోతుంది. అందుచేత సత్యం మనకు తెలియబడటంలేదు. మీరు సత్యాన్ని అన్వేషించకుండా సత్యం మీకు తెలియబడదు. సత్యాన్వేషణ చేస్తేనే గాని రూపబుద్ధి, నామబుద్ధి నశించదు. మనం ఏవైనా మంచిపనులు చేసినా పేరుకోసం చేస్తున్నాము కాని ఈశ్వరుని దయను సంపాదించటం కోసం చేయటంలేదు. అందుచేత మనకు ఈశ్వర సాక్షాత్కారం కూడా సాధ్యంకాదు. మనలో ఏ తలంపులు ఉన్నాయో అవి మన సహస్రారానికి వస్తేగాని మనకు తెలియవు. అవి సహస్రారానికి రాకముందే ఆ తలంపుల గురించి ఈశ్వరుడికి తెలుసు. ఒక మనిషి ఇంకో మనిషిని మోసం చేయగలడు గాని భగవంతుని మోసం చేయలేడు.

కాళిదాసు ఏమని చెప్పాడంటే నాకు ఏ వాసనా లేదు అని నువ్వు అనుకోవద్దు. ఏ

ఇంద్రియానికి ఏ విషయం అవసరమో ఆ విషయాలు అన్నీ ఎదురుగా ఉండాలి, అప్పుడు కూడా ఆ విషయాల మీద నీకు ఆకర్షణ కలగకపోతే అదీ ఇంద్రియ జయం అని చెప్పాడు. అంతేగాని అందని ద్రాక్షపళ్ళు పుల్లన అంటే అది కుదరదు అన్నాడు కాళిదాసు. నీమనస్సులో వంద వికారాలు రానియ్యి, ఆ వికారాల గొడవ, ఆ సోది అంతా ఎందుకు. ప్రపంచంలో ఏమనిషికి ఏ వికారం వచ్చినా దానికి కామక్రోధాలే కారణం, వస్తే కామంలో నుండి వస్తుంది, లేకపోతే క్రోధంలో నుండి వస్తుంది. ఈరెండూ తీసేస్తే అసలు మనిషికి వికారంలేదు. ఎందుకు సోది అంతా చెపుతావు అంటున్నాడు. మనకు శక్తి ఉంటే ఆచరించటం, లేకపోతే నోరు మూసుకుని పడి ఉండటం. మీరు డబ్బు సంపాదించుకోవటానికి అమెరికా వెళుతున్నారు కదా అలాగే సత్పురుషుల సహవాసం కోసం, సహృదయం ఉన్నవారి సమక్షం కోసం, అవసరమైతే భూమి యొక్క అంచుల దాకా వెళ్ళండి. మీకు డబ్బుంటే స్థలాలు, పొలాలు, మేడలు కొనుక్కోగలరు గాని మహాత్ములను డబ్బు పెట్టి కొనలేరు. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి. నీ అంతట నువ్వు సాధన చేసి నీమనస్సును శాంతపరచుకోలేకపోయినా మహాత్ముల దగ్గర నుండి వచ్చే శాంతి తరంగాలు, కాంతి తరంగాల వలన మీ మనస్సుకు శాంతి కలుగుతుంది, మీ మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది. ఇంకొకటి బాగా జ్ఞాపకం పెట్టుకోండి, మీకు ఇంటి దగ్గర డబ్బు ఎక్కువగా ఉందా, తక్కువగా ఉందా అనేది ముఖ్యం కాదు, మీకు పాండిత్యం ఉ ందా లేదా అనేది ముఖ్యంకాదు, మీ మనస్సు ఎంతవరకు బాగుపడుతోంది అనేది ముఖ్యం. ఎందుచేతనంటే మీరు బాగుపడినా మీ మనస్సే కారణం, మీరు పాడయిపోయినా దానికి మీ మనస్సే కారణం. అందుచేత మీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి, మీ మనస్సును నిర్మలం చేసుకోవటానికి ప్రయత్నంచేయండి. దానికంటే మించిన పని ఈ ప్రపంచంలో ఏదీ లేదు. మన మనస్సులో ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయి, మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటి అని విచారణ చేసుకొని మనస్సును బాగుచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. బాగుపడిన మనస్సు మనలను ఈశ్వరుని పాదాల దగ్గరకు చేరుస్తుంది. నీ మనస్సు నిర్మలం అవ్వటానికి, మనస్సు అణగటానికి సత్పురుషుల సన్నిధానం అవసరం.

నేను అనే తలంపు, నాది అనే తలంపు ఈ రెండూ మన కళ్ళకు కనబడుతూ ఉంటే అవి ఎక్కడికి పోతాయి. వాటిని మనం వదిలించుకోలేము, అవే మనలను విడిచిపెట్టి వెళ్ళిపోవాలి. అలా తుకారామ్‌ని విడిచిపెట్టి వెళ్ళిపోయినాయి. పాండురంగడివల్ల ఆయనకు

ఉన్న భక్తి ప్రవాహంలో, శరణాగతి ప్రవాహంలో నేను అనే తలంపు, నాది అనే తలంపు ఆయనకు తెలియకుండానే కొట్టుకొనిపోయాయి. తుకారామ్ భార్య ఆయనను ఎన్నో ఇబ్బందులు పెట్టింది, తుకారామ్‌ని కొట్టేది కూడా అయినా ఎప్పడూ ఆయనకు భార్యమీద కక్షరాలేదు, ద్వేషభావన రాలేదు, వారు మహాత్ములు అంటే. పైగా తుకారామ్ ఎంత గొప్పవాడు అంటే ఆయనను తీసుకొని పోవటానికి వైకుంఠం నుండి విమానం వస్తే నువ్వు కూడా వచ్చేయి అని భార్యను అడిగాడు. పాపం ఎన్ని దెబ్బలు కొట్టినా నువ్వు కూడా వచ్చేయి అని భార్యతో తుకారామ్ అంటున్నాడు. భగవంతుడు మాయ చూడండి. వైకుంఠం అంటే నారాయణుడు ఉండేస్థానం అని ఆవిడికి స్ఫురించటంలేదు. ఏదో భీమవరం, పాలకొల్లు వెళ్ళటంలా అనుకొంటోంది. ఇద్దరం ఇంట్లో నుండి బయటకు వెళ్ళిపోతే ఎలాగ? ఇంటి దగ్గర ఎవరో ఒకరు పని చూసుకోవాలి కదా మీరు వెళ్ళిరండి అంది. అంతే మరల తిరిగిరాని చోటుకు ఆయన వెళ్ళిపోయాడు. తరువాత గాని తుకారామ్ భార్యకు అది అర్థంకాలేదు. తుకారామ్ రమ్మంటే మాత్రం ఆవిడ వెళుతుందా ఈశ్వరుడు మాయ చేసి పడేస్తాడు. అదే గీతలో పరమాత్మ చెప్పాడు. నా దయ లేకుండా నా మాయను ఎవరూ అతిక్రమించలేరు అని చెప్పాడు. ఒకోసారి బాగా స్నేహితులకు కూడా మనం అపకారం చేస్తాము. స్నేహితులకు అపకారం చేస్తున్నాము ఏమిటి అనే బుద్ధి కూడా మనకు రాదు. జూలియస్ సీజర్ బ్రూటస్‌తో అంటాడు ఇంతకాలం స్నేహంగా ఉండి నన్ను చంపటానికి వచ్చావు, నువ్వు నిన్నటి వరకు మంచిగానే ఉన్నావు, ఈరోజు దుర్మార్గులతో సహవాసం మొదలుపెట్టావు. నేను చనిపోతున్నానని నాకు దుఃఖం లేదు, నువ్వు పాడైపోతున్నావని దుఃఖపడుతున్నాను అన్నాడు. సత్పురుషుల లక్షణం చూడండి. ఒకోసారి మంచివారికి అయినా చెడ్డబుద్ధి కలుగుతుంది. భగవంతుడు ఏమని చెప్పాడు అంటే నా మాయ బుద్ధిలో ఉంటుంది, మనస్సులో ఉంటుంది, ఇంద్రియాలలో ఉంటుంది, దేహంలో ఉంటుంది. నువ్వు దేహాన్ని, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని అతిక్రమిస్తేనే కాని నీకు స్వరూపజ్ఞానం కలుగదు. స్వరూపజ్ఞానం కలిగేవరకూ మాయ నిన్ను విడిచి పెట్టదు. మహాత్ముల యొక్క సన్నిధి ఎటువంటిది అంటే లోపల ఉన్న వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చేవరకూ, నీకు సమాధిస్థితి కలిగే వరకూ, మహర్షుల యొక్క దయ నిన్ను మోసుకొనిపోతుంది. నువ్వు ఇంద్రియాలను, బుద్ధిని, దేహాభిమానాన్ని అతిక్రమించడమే కాదు నేను మిమ్మల్ని ఎంత స్పష్టంగా చూస్తున్నానో మీరు నన్ను ఎంత

స్పష్టంగా చూస్తున్నారో సమాధిస్థితిలో ఉన్నవాడు భగవంతుడిని అంత స్పష్టంగా దర్శించగలడు.

రామకృష్ణుడు నరేన్‌తో అంటాడు ఒకోసారి నీమనస్సు ఒకటి చెపుతుంది, నీహృదయం వేరొకటి చెపుతుంది. ఏమి చెయ్యాలి అని నీలోనే ఘర్షణ ప్రారంభమవుతుంది. ఏమి చెయ్యమంటారు, ఏమి చెయ్యమంటారు అని అప్పుడు కొంపలచుట్టూ తిరగకు. నీ మనస్సును తీసి ఒక ప్రక్కన పెట్టి నీ హృదయం ఎలా చెపితే అలా చెయ్యి నరేన్ అంటాడు. వాసనలు అంటే అవి చాలా బరువైన రాళ్ళు. మీచేతులతో ఎత్తి వాటిని బయట పడేయలేరు. మహాత్ముల సమక్షంలో వారి అనుగ్రహప్రవాహంలో అవి అన్నీ కొట్టుకొనిపోతాయి, వారి అనుగ్రహం అట్టిది. భౌతికవిషయాలతో దానిని వెలకట్టలేము. నీకు ఉన్న డబ్బు అంతా ఖర్చు పెట్టి ఆ వాసనను తొలగించుకోలేవు. అటువంటిది గురువు సమక్షంలో ఆ వాసన కాలి బూడిద అయిపోతుంది. గురువుఅనుగ్రహం అంత బలీయమైనది.

గురువు సమక్షంలో, మహాత్ముల సమక్షంలో నువ్వు ఏదైతే పొందావో, దానిని అక్కడే దులిపేసుకోవద్దు, ఇంటికి వెళ్ళిన తరువాత దానిని మరిచిపోవద్దు, దానిని ప్రాక్టీసు చెయ్యి. రోజూ మీయిల్లు ఎలా తుడుచుకొంటున్నారో, అలాగే రోజూ నీ మనస్సును తుడుచుకో. మీ ఇంటిలో ఉన్న దుమ్మును ఎలా పోగొట్టుకొంటున్నావో, అలాగ నీ మనస్సులో ఉన్న దుమ్మును, బలహీనతలను పోగొట్టుకోవాలని నీకు తెలియటం లేదా? గురువు చెప్పింది ఇక్కడే మరిచిపోవద్దు. నువ్వు శ్రవణం చేసిన మాటలను మననం చేసుకో. గురువు చెప్పిన మాటలను శ్రవణం చేస్తున్నావు, అది శ్రవణ సాధన. ఇంటికి వెళ్ళి ఆ మాటలను మనస్సులో తిప్పుకో, అది మనన సాధన. ఇలా శ్రవణ, మననాలు చెయ్యగా చెయ్యగా నీకు ధ్యానస్థితి కలుగుతుంది. ధ్యానస్థితి వలన సమాధిస్థితి కలుగుతుంది. సమాధిస్థితిలో నువ్వు ఈశ్వరుడిని ప్రత్యక్షంగా దర్శించగలవు.

మనస్సు పూర్తిగా వేరుతో సహా నశించేవరకూ మనిషికి సందేహాలు వస్తాయి. రామకృష్ణుడు చివరి రోజులలో కేన్సర్‌తో బాధపడుతూ కూర్చోలేకపోతాడు, పడుకోలేకపోతాడు. అప్పుడు నరేంద్రుడు లోపల అనుకొంటాడు - ఈయన పడుకోబెడితే కూర్చోబెట్టమంటున్నాడు. కూర్చోబెడితే పడుకోబెట్టమంటున్నాడు. అది దేహధర్మం. ఇప్పుడు కూడా ఈయన దేహమాత్రుడేనా, ఈయనకు భగవదనుభవం ఉందా అని సందేహపడేవాడు. మనస్సు ఎంత పల్చబడ్డా సందేహాలు రావటం మానవు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు ఓ నరేన్!

నీకు ఎన్నిసార్లు చెప్పినా సందేహాలు తీరవు. ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు. లోకాచారంగా, వ్యవహారికంగా చెపుతున్నాను, కాని అద్వైత పరంగాకాదు. అద్వైతపరంగా చూస్తే ఉన్నది ఒక్కటే. రాముడు, కృష్ణుడు బయట ఉన్న రాక్షసులను చంపటానికి వస్తే లోపల వాసనరూపంలో ఉన్న రాక్షసులను సంహారం చెయ్యటానికి వీడు వచ్చాడు. యిన్ని సందేహాలతో, అనుమానాలతో కాలిపోతున్నప్పటికి నువ్వు నన్ను విడిచిపెట్టివెళ్ళలేవు, నువ్వు నా నరేంద్రుడివి, నేను నీ రామకృష్ణుడిని అంటాడు. అది జన్మాంతర అనుబంధం, గమ్యం చేరే వరకూ ఆ అనుబంధం అలాగే ఉంటుంది. నువ్వు సాధన చెయ్యవచ్చు. బలంగా ఉన్న నీ వాసనలను బలహీనపరచ వచ్చు. నీ శరీరానికి అన్నం పెట్టటం మానేస్తే అది ఎలా చిక్కిపోతుందో అలాగ నీ అలవాట్లను రిపీట్ చెయ్యకుండా ఉంటే అవి చిక్కిపోతాయి కాని ఎక్కడో మనస్సులో మారుమూల విత్తనరూపంలో ఉంటాయి. అవి కూడా రాలిపోవాలంటే గురువు అనుగ్రహం లేకుండా అది సాధ్యంకాదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-12-2010, గొరగనమూడి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణాష్టమి, శ్రీరామనవమి, శంకర జయంతి యిలాగ దేవతా పురుషుల పుట్టినరోజులు చేసుకోవటం ఎందుకంటే దీనివలన వారికి కలిసివచ్చేది ఏమీ లేదు, వారిని స్మరించుకోవటం వలన మనం పవిత్రులం అవుతాము. వారిని స్మరించుకోవటంవలన ఇంద్రియ విషయాలలో నుండి, మనస్సు యొక్క చపలత్వంలో నుండి నెమ్మదిగా విడుదల కలుగుతుంది. మనం దేనిని స్మరిస్తూ ఉంటే అదే అవుతాము. నువ్వు దేని గురించి ఆలోచిస్తూ ఉంటే అదే అవుతావు. మనకు వచ్చే తలంపుల విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదు. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నామో జాగ్రత్తగా చూసుకోవాలి. ఆ అలవాటు మనకు లేదు. మనం ఎంతసేపు బయటి ప్రపంచాన్ని చూస్తాము కాని మన లోపల ఏ బలహీనతలు ఉన్నాయి అని చూసుకోవటంలేదు. మీలో ఏ లోపాలు ఉన్నాయి అని ఎంతసేపు చూస్తాడు కాని తన మనస్సులో ఏ లోపాలు ఉన్నాయి అని వాడు చూసుకోడు. ఇలా బయటకు చూసేవాడి కంటే మన మనస్సులో ఏ లోపాలు ఉన్నాయి అని చూసుకొనేవాడు వాటిలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేస్తాడు, వాడే మహర్షిగా, మహాత్ముడుగా రూపొందుతాడు. అందుచేత మనం లోపలకు చూడటం నేర్చుకోవాలి. జ్ఞానానంద ఆయన సెయింట్ అయినా

సైంటిస్టుగా ఆయనకు ఎక్కువ ఖ్యాతి వచ్చింది. ఆయన చాలా నిరాడంబరమైన వ్యక్తి. సర్వసాధారణంగా కొంత చైతన్యస్థాయి పెరిగాక వారిలో ఆడంబరం కనబడదు, ఇతరుల చేత గుర్తింపబడాలి అనే ధ్యాస కూడా వారికి ఉండదు.

ఏదో ఒక మహాత్ముడితో మనకు మానసికఅనుబంధం ఉండాలి. రమణుడు అవ్వవచ్చు, రామకృష్ణుడు అవ్వవచ్చు, రాముడు అవ్వవచ్చు, కృష్ణుడు అవ్వవచ్చు, మహాత్ములతో మానసికఅనుబంధం వలన మన మనస్సు కండిషన్‌లో పడుతుంది. కాలేజీ మేనేజ్‌మెంట్ ఎలా ఉండాలి, ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ ఎలా ఉండాలి ఇవన్నీ ఎలా నేర్చుకొంటున్నామో, మహాత్ములతో మానసికఅనుబంధం వలన మన మనస్సును ఎలా మేనేజ్ చేసుకోవాలో మనకు తెలుస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి అనుకొన్నప్పుడు ముందు మన మనస్సును ఎలా మేనేజ్‌చేసుకోవాలో చూసుకోవాలి. మన హృదయంలో ఒక నిజం ఉంది. దానికి మనోదేహములతో సంబంధం లేదు గాని మనోదేహములకు ఆధారంగా ఉంది, అది స్వంతంత్రమైనది. మైండ్ మేనేజ్‌మెంట్ మనకు అలవాటు లేకపోతే మైండ్‌ను లోపలకు విత్‌డ్రాచేసి లోపల ఉన్న సత్యంలో దానిని విలీనం చేయలేము. అందుకే మహాత్ములతో అనుబంధం అవసరం.

ఆచార్యులవారు భగవద్గీత గురించి చెపుతూ మీరు 700 శ్లోకాలు చదవలేకపోతే 700 శ్లోకాల సారం ఒక శ్లోకంలో ఉంది. అందులో జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం అన్నీ ఉంటాయి. ఆ శ్లోకాన్ని ముట్టుకొంటే మొత్తం 700 శ్లోకాలను ముట్టుకొన్నట్లే. గీతాసారం అంతా ఆ శ్లోకంలో ఉంది అని చెప్పారు. అంటే మిమ్మల్ని మిగతా శ్లోకాలు చదవవద్దనికాదు. మనం గంగానదిలో ఒకచోట స్నానం చేస్తే గంగానదిలో అంతా మనం స్నానం చేసినట్లే, అంతా అదే నీరు కదా.

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః**

**నిర్వైరస్సర్వ భూతేషు యస్సమామేతి పాణ్డవ!**

**మత్‌కర్మకృత్.** మీరు నా పని చేస్తూ ఉండండి. మీరు ఎలా పని చేస్తే నా దయ మీకు కలుగుతుందో అలా పని చెయ్యండి. మనం చేసే పనిని మన అహంకారానికి, మన మనస్సుకు ఆఫర్ చేయకూడదు, ఈశ్వరుడికి ఆఫర్ చెయ్యాలి. అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను, వారి ప్రారబ్ధంననుసరించి ఆడించే వాడిని నేనే అని పరమాత్మ చెప్పాడు.

మనమే తెలివైనవారము, ఇదంతా మనవల్లే జరిగిపోతోంది అనుకొంటే మన మనస్సు చావదు. నీ మనస్సుకంటే ఒక హయ్యర్ పవర్ ఉందని నీ మనస్సు గుర్తించేవరకు అది నశించదు. నా పనులు చెయ్యి అంటే సత్కర్మలు చెయ్యి, సత్కర్మ కూడా నిరాడంబరంగా చెయ్యి, నిరహంకారంగా చెయ్యి. గుర్తింపులకోసం చేయవద్దు. నాదయను సంపాదించటం కోసం పనిచెయ్యి, నా దయ లేకుండా నీకు నేను తెలియబడను. ఆధ్యాత్మిక జీవితానికి బ్రహ్మచర్య ఆశ్రమంలోనే పునాదులు పడాలి అని చెపుతారు. జ్ఞానానందవాళ్ళు బ్రహ్మచర్య ఆశ్రమంలో నుండే ఆధ్యాత్మిక జీవితంలోనికి జంప్ చేసారు. సన్యాశాశ్రమం అంటే మనం అందరం కాషాయబట్టలు కట్టుకోనక్కరలేదు, ప్రపంచంతో మనకు ఉన్న సంపర్కం వదిలేయాలి. ప్రతీ మనిషికి రాగద్వేషములు ఉంటాయి. రాగద్వేషాలను వేరుతోసహా, నిశ్శేషంగా ఎవడైతే తొలగించుకొన్నాడో వాడే సన్యాసి. ఎక్కడైతే యిష్టం ఉందో అక్కడ కామం ఉంటుంది. ఎక్కడైతే అయిష్టం ఉందో అక్కడ ద్వేషం ఉంటుంది. మీకు డిజ్‌లైక్స్ ఉంటే ఆ డిజ్‌లైక్స్‌ను డిజ్‌లైక్ చేయండి. డిజ్‌లైక్‌ను డిజ్‌లైక్ చేయకపోతే మీకు మరల ద్వేషం వస్తుంది.

మీలో ఎవరికైనా దుఃఖం వస్తోందా? ఎవరికీ రావటంలేదేమో. మీరందరూ బుద్ధుడు అయిపోయారేమో. బుద్ధత్వం అంటే ఒక వ్యక్తి కాదు, దుఃఖ స్పర్శ ఎలా ఉంటుందో తెలియని స్థితికి మీరు వెళ్ళిపోయారు అనుకోండి మీరే బుద్ధుడు. మా మనస్సు బాగాలేదు, అశాంతిగా ఉంది అని చాలామంది అంటారు. మనస్సు అశాంతిగా ఉండటానికి అలవాట్లు, కోరికలు కారణం. మనకు పూర్వజన్మలనుండి వచ్చే అలవాట్లు కొన్ని ఉంటాయి, అవి మనలను అశాంతిలోనికి గెంటేస్తాయి. వాటిని తొలగించుకోవటానికి మనకు ఉన్న శక్తి సరిపోదు. అప్పడే గురువు సహాయం కావాలి. అలవాట్లు చాలా లోతుగా ఉంటాయి, అవి ఎన్నోజన్మల నుండి వస్తున్నాయి. అవి ఎంత లోతుగా ఉన్నాయో అంత లోతులలోనికి వెళ్ళి సాధన చేస్తే గాని అవి బయటకుపోవు. మనం పరమాత్మకంటే భిన్నంగా ఉన్నాము అని అనుకొంటున్నాము, ఆయనని కాదని ఏదో సాధించేయాలి అనుకొంటున్నాము. పరమాత్మను కాదని నువ్వు ఏమి చేయగలవు. ఆయన సహాయం లేకుండా మనం ఏదీ సాధించలేము. పరమాత్మను కాదని మనం ఏదయినా సాధించగలము అనే బుద్ధి ఉన్నంతకాలం మనం సాధన చేయవలసిందే. మనకు ఇష్టంలేని సంఘటనలు జరిగితే మనకు దుఃఖం వస్తుంది అంటే భగవంతుడి సంకల్పాన్ని మనం అంగీకరించటంలేదు. నువ్వు భగవంతుడికంటే భిన్నంగా

ఉన్నాను అనుకొంటున్నావు కాబట్టి ఆయన సంకల్పాన్ని అంగీకరించటంలేదు. నీ అలవాట్ల నుండి విడుదలపొందాలంటే స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం ఈ మూడు అవసరం. ఈశ్వరుడికి పక్షపాతం లేదు. మన అందరిమీద ఆయన దయ ఉంది కాని దానిని రిసీవ్ చేసుకొనే అర్హత ఇక్కడ మనకు లేదు. ఎవడి హృదయం అయితే విశాలం అయ్యిందో, ఎవడైతే లోపల వికాశం పొందాడో వాడికి ఆయన దయ అందుతూ ఉంటుంది. మెచ్యూరిటీ లేనివాడి మీద కూడా ఆయన దయ ఉంటుంది కాని వాడు దానిని అందుకోలేడు.

నేను ఏపని అయితే చెయ్యమన్నానో ఆ పని చెయ్యండి, నేను వద్దని చెప్పిన పని మానేయండి. వాటి గురించి చర్చవద్దు అంటున్నాడు పరమాత్మ. నువ్వు పని చేస్తూనే పొందవలసింది ఏదో పొందాలి, పని మానివేస్తే సోమరితనం వస్తుంది. కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుడి సహాయంతో కౌరవులమీద పాండవులు నెగ్గారు. మనలో ఉన్న మంచిగుణాలు పాండవులు, చెడుగుణాలు కౌరవులు, మన శరీరంలో మంచిగుణాలకు చెడుగుణాలకు నిరంతరం యుద్ధం జరుగుతోంది. కేవలం మన తెలివితేటల వలన చెడ్డగుణాల నుండి మనం బయటపడలేము, దానికి దైవసహాయం అవసరం. పరమాత్మయొక్క అనుగ్రహం ఉంటే మనలో ఉన్న మంచిగుణాలు చెడ్డగుణాలమీద విజయం సాధిస్తాయి. నువ్వు ఎలా పనిచేస్తే భగవంతుడిలో ఐక్యమవుతావో అలా పనిచెయ్యటం నేర్చుకో, అదే యోగం. మీరు ఫలకాంక్ష లేకుండా పనిచేస్తే మీకు రెండు లాభాలు. ఫలితం వస్తుంది, ఈశ్వరుని దయ కూడా వస్తుంది. ఫలకాంక్షతో పనిచేస్తే ఫలితం రావచ్చుకాని ఈశ్వరునిదయ రాదు. నువ్వు పనిచేసేటప్పుడు లోపల ఏ ఉద్దేశంతో చేస్తున్నావో దానినిబట్టి ఈశ్వరుడు మార్కులు వేస్తాడు కాని నువ్వు పెద్దపనిచేసావా, చిన్నపనిచేసావా అని ఆయనకు అక్కరలేదు. జీవుడు ఎవరు, దేవుడు ఎవరు అని స్వామివివేకానంద అంటూ స్వార్థమే జీవుడు, స్వార్థం లేకుండా ఉండటమే దేవుడు అనేవారు. మనం చేసే పని వలన మనకు దేహాభిమానం తగ్గాలి, శవబుద్ధి తగ్గాలి. శవబుద్ధి తగ్గకుండా నీకు ఆత్మబుద్ధి కలుగదు.

ఇప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను దేహానికి పరిమితం. అలాగే కృష్ణుడు కూడా నేను, నేను అంటాడు, అది దేహానికి పరిమితమైనది కాదు, అది యూనివర్సల్ ఐ, మనది ఫాల్స్ ఐ. అంటే ఈ దేహమే నేను అని మనం అనుకొంటాము, వాడేమో నాకు ఒక శరీరం ఉంది అనుకొంటాడు. నువ్వు ఎలా పనిచేస్తే నాలో ఐక్యమవుతావో గురువును

ఆశ్రయించి ట్రైనింగ్ పొంది అలా పనిచెయ్యి. అలా పని చేస్తే కర్మ కూడా యోగం అయ్యి నది వెళ్ళి సముద్రంలో ఐక్యమయినట్లు మీరు నాలో ఐక్యమవ్వటానికి అది మీకు సహాయసహకారములు అందిస్తుంది. **మత్పరమః** అంటే మీ ధ్యాస నామీదే ఉండాలి. ధ్యాసకుదిరితే ధ్యానం కుదురుతుంది. ధ్యానం కుదరాలి అంటే మనకు పరమేశ్వరుడి మీద ఇష్టం ఉండాలి, ప్రేమ ఉండాలి, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నూటికి నూరుపాళు ళ విశ్వాసం ఉండాలి. మహాత్ముల సన్నిధిలో ధ్యానం చేస్తే వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి, వారి గ్రేస్ మిమ్మల్ని లోపలకు తీసుకొనిపోతుంది. మీరు ఏ వస్తువునయితే ధ్యానం చేస్తున్నారో ముందు అక్కడ ప్రీతి ఉండాలి. నాకు భగవంతుడి మీద మనస్సు నిలబడటం లేదు అని ఒక ఆయన నాతో అన్నారు. అంటే మీకు ఇష్టంలేదు అన్నాను నేను. ప్రక్కన వాళ్ళ అబ్బాయి ఉన్నాడు, నేనంటే మా నాన్నగారికి ఇష్టమేనండి అని చెపుతున్నాడు. అప్పడు నేను ఆయనతో ఏమి చెప్పాను అంటే మీకు అదనంగా ఇష్టం వద్దు, మీ అబ్బాయి అంటే మీకు ఇష్టమే అంటున్నారు కదా ఆ మాత్రం ఇష్టం భగవంతుడిమీద పెట్టండి సరిపోతుంది అని చెప్పాను.

మీకు అనుకొన్న సంఘటనలు జరిగితే ప్లెజర్ రావచ్చు, ఇష్టంలేని సంఘటనలు జరిగితే పెయిన్ రావచ్చు. ఇవన్నీ మనస్సు సరిహద్దులో ఉన్నాయి. ఈ మనస్సును ఓవర్‌కమ్ చేస్తేనేకాని నీకు సత్యానుభవం కలుగదు. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏ మహాత్ముడిని ఆశ్రయించినా నువ్వు సత్యానుభవం పొందాలి లేకపోతే నీకు స్వేచ్ఛలేదు, స్వాతంత్ర్యం లేదు. మీరు గుడికి వెళ్ళి పదిరూపాయలు హుండీలో వేసి, పది పువ్వులు పళ్ళు అక్కడపెట్టేసి మీకు కోరికలు ఉంటే చెప్పేసి వస్తున్నారు. మీ ఇంటికి యాచకుడు వస్తే అన్నం పెడుతున్నారు. కాని మీరు, నేను, మనందరం చేసే పొరపాటు ఏమిటి అంటే మనం పూలు ఇస్తున్నాము, పళ్ళు ఇస్తున్నాము కాని మన టైమును భగవంతుడికి ఇవ్వటంలేదు. నేను కాలరూపంలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. ఎవరిని అడిగినా నేను చాలా బిజీగా ఉన్నాను అంటున్నారు. ఏ విషయంలో బిజీగా ఉంటున్నారు. భగవంతుడిని తెలుసు కోవటానికి ఎంత టైము ఖర్చుపెడుతున్నారు. మీరు గంటకో రకంగా ఉంటున్నారు. మీకు స్థిరత్వం లేదు. కూర బాగాలేదు అని మీ భర్త అంటే వెంటనే మీకు కోపం వచ్చేస్తుంది. చిన్న మాటను కూడా భరించలేకపోతున్నారు. నువ్వు కేవలం పూజ చేయటమేకాదు నీ జీవితంలో వచ్చే కష్టాలను, నిందలను భరించగలగాలి. జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణుడిని

అడిగితే మనం నేను, నేను అని అంటున్నాము కదా, ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అని చెప్పారు.

మీరు కృష్ణుడి రూపాన్ని తలపెట్టుకోండి, ఆయన నామాన్ని స్మరించుకోండి, ఆయనే మనకు పెద్ద చుట్టం అనుకోండి. ఆయన బోధను మన బుర్రలో తిప్పకోవాలి, మన మనస్సును ఇంద్రియాలను ఆయనలో నానబెట్టాలి. అప్పడు మన మనస్సు, ఇంద్రియాలు సంస్కరింప బడతాయి. సంస్కరింపబడిన మనస్సుకు లోచూపు కలుగుతుంది. బయట ఉన్న నారాయణుడు లోపలి నారాయణుడిని పట్టియిస్తాడు. వ్యవసాయాత్మకబుద్ధి కలిగి ఉండు అర్జునా అంటున్నాడు పరమాత్మ. అంటే నిశ్చలమైన బుద్ధి, అక్కడ వేవరింగ్ ఉండకూడదు, భగవంతుడు అనేవాడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉండాలి, అప్పడు నామీద నీ మనస్సు నిలబడుతుంది అని చెపుతున్నాడు. మద్భక్తః అంటే నాకు భక్తుడిగా ఉండు నాకు అంటే అక్కడ శరీరం కాదు సత్యం అని మనం మరిచిపోకూడదు. మనందరం భక్తులం కాకపోయినా భక్తుల కింద చెలామణి అవుతున్నాము. ఆచార్యులవారు ఎవడు భక్తుడు అని చెప్పారంటే నీ ఇంద్రియాలకు, మనస్సుకు వాసుదేవుడు తప్పించి ఇంకోటి కనపిస్తూ ఉంటే నీకు భక్తి లేదు అని చెప్పారు. మన ఇంద్రియాలకు, మనస్సుకు 24 గంటలు వాసుదేవుడు తప్పించి ఏమీ కనబడకుండా ఉంటే మీరు భక్తులు, అప్పడు మీరు వాసుదేవుడిలో లయం అవుతారు. భక్తుడి లక్షణాలు ఏమిటి అంటే మీరు ఖరీదైన బట్టలు కట్టకూడదు, ఖరీదైన ఆహారం తినకూడదు, అది భక్తుడికి మంచిదికాదు. కట్టుకొనేబట్టలు, తినే ఆహారం సామాన్యంగా ఉండాలి. మీకు డబ్బు ఉంటే దాచుకోండి. డబ్బు ఉందని ఖరీదైన బట్టలు కడితే భక్తుడి లక్షణాలు పోయి రజోగుణం వచ్చేస్తుంది. మన జీవితవిధానం మనలో ఉన్న సత్వగుణాన్ని పెంచాలి గాని రజోగుణాన్ని పెంచకూడదు. మీరు సాధ్యమయినంత వరకూ నిరాడంబరంగా ఉండాలి. భక్తి పేరు మీద సామాన్య మానవుడికి దూరం అవ్వకూడదు. కృష్ణుడు అంతపాపులర్ గాడ్ ఎందుకు అయ్యాడు అంటే ఆయన కామన్‌మేన్‌కు దూరం అవ్వలేదు, కామన్‌మేన్‌తో కలిసి ఉండేవాడు. మన భక్తి ఎంతవరకు వచ్చింది అని చూసుకోండి. నీ ఇంద్రియాలకు భగవంతుడే కనబడాలి, నీ మనస్సుకు భగవంతుడే కనబడాలి. నువ్వు ఎవరికయినా మంచి చేస్తూ ఉంటే ఆ మంచి ఎవరు పొందుతున్నారు అంటే ఆ దేహం ద్వారా వాసుదేవుడే పొందుతున్నాడు, అక్కడ ఎల్లయ్య, పుల్లయ్యలను చూడకు,

వాసుదేవుడినే చూడు. అప్పుడు నీకు బేదబుద్ధి పోతుంది. బేధబుద్ధి ఉన్నంతకాలం పునర్జన్మను ఎవరూ ఆపలేరు.

మనం రోజూ చేసే పని ఏమిటి అంటే ఈ ప్రపంచాన్ని నాకటమే మన పని. అక్కడ ఏమి జరిగింది, ఇక్కడ ఏమి జరిగింది, వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అని చనిపోయేవరకు డైరెక్టుగానో, ఇండైరెక్టుగానో మామిడిటెంకను నాకినట్లుగా ఈ ప్రపంచాన్ని నాకటమే మన పని. మన మనస్సును ఇంద్రియాల ద్వారా బయటకు పంపి ప్రపంచాన్ని నాకుతున్నాము, అంతకంటే మనకు ఏమైనా పని ఉందేమో చెప్పండి. డబ్బు గురించి ఆలోచించినా, గౌరవం గురించి ఆలోచించినా అది ప్రపంచాన్ని నాకటమే ఎందుచేతనంటే ఇవన్నీ ప్రపంచంలో ఒక భాగమే కాని సత్యంలో ఒక భాగం కాదు. **సంఘవర్జితః** అంటే ప్రపంచంలో ఏ విషయాల మీద ఆసక్తి పెట్టుకోవద్దు. మనం ప్రపంచాన్ని కౌగిలించుకొంటున్నాము. మనం ప్రపంచాన్ని ఎంతగట్టిగా ముద్దుపెట్టుకొంటున్నాము అంటే సిగరెట్ కాల్చేవాడు చివరిదమ్ము ఎలా లాగుతాడో అంత గట్టిగా మనం ప్రపంచాన్ని ముద్దు పెట్టుకొంటున్నాము. అంటే మనం ఆరోజుకారోజు దేవుడికి దూరమవుతున్నాము, ప్రపంచానికి దగ్గరవుతున్నాము. అంటే మనకు తెలియకుండా పునర్జన్మలు పెంచుకొంటున్నాము. ప్రపంచ విషయాలమీద వైరాగ్యం లేకుండా ఎవడికీ జ్ఞానంరాదు. మనం బయటకు చాలా స్పీడుగా వెళతాముకానీ ఒక్క అంగుళం కూడా లోపలకు దిగలేము. సత్యానుభవం పొందాలంటే నువ్వు లోపలకు ప్రయాణం చెయ్యాలి. ఎక్కడో నేను పైన ఉన్నాను అని భగవంతుడు చెప్పలేదు, మీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడు.

మన శరీరం చనిపోయేటైముకు అన్ని బలహీనతలనుండి విడుదలపొంది చివరకు ఏదో ఒక్క బలహీనత మిగిలింది అనుకోండి అది పునర్జన్మకు కారణం అవుతుంది. అంటే మన మనస్సులో ఏదో చిన్న లోపం ఉన్నా దాని వలన పునర్జన్మ వచ్చేస్తుంది. మన హృదయంలో ఉన్న సత్యం ఎంత పవిత్రంగా ఉందో మన మనస్సు కూడా అంత పవిత్రం అయితేనే మన మనస్సు సత్యంలో ఐక్యమవుతుంది కాని లేకపోతే సత్యం దానిని రిజక్టు చేస్తుంది. మనకు ప్రపంచంలో ఏ విషయాల మీద ఆసక్తి ఉన్నా మనస్సు బాహ్యాముఖానికి పోతుంది. బాహ్యాముఖమైన మనస్సుకు ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. గురువు చేసే సహాయం ఏమిటి అంటే బాహ్యాముఖమవుతున్న నీ మనస్సును లోపలకు గెంటటానికి చూస్తాడు.

మనస్సుకు లోచూపు రాకుండా అది సత్యాన్ని అన్వేషించలేదు. ఎవడైతే సత్యాన్వేషణ చేయలేకపోతున్నాడో వాడు దేహబుద్ధిలో నుండి విడుదల పొందలేడు. దేవుడిని మనం భౌతిక విషయాలు అడిగితే ఇస్తేఇస్తాడు, ఒకవేళ ఇవ్వడు అనుకోండి మీరు కంగారుపడవద్దు. మనం అడిగింది ఎందుకు ఇవ్వడు అంటే అడిగింది ఇస్తే మనం పాడైపోతాము అని ఆయనకు తెలుసు. అందుచేత ఆపుచేస్తాడు కాని మనం అంటే ఇష్టంలేకకాదు, మనలను బాధపెట్టాలి అనికాదు. సత్యం వైపుకు మన మనస్సును మళ్ళించటానికి ఒకోసారి మనలను సఫరింగ్‌కు గురిచేస్తాడు. ఒకోసారి మీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఇదేమిటి ఇలా జరిగింది అనుకుంటాము, అది మరల టర్నింగ్ పాయింట్‌కు వచ్చి అది మీకు అనుకూలం అయిపోవచ్చు. కనిపిస్తున్న మనిషినే మనం అర్థం చేసుకోలేము, ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో మనకు తెలియటంలేదు కదా. ఇంక సృష్టి గురించి మనకు ఏమి తెలుస్తుంది.

**నిర్వైరః సర్వభూతేషు** ఎవరైనా మీకు అపకారం చేసినా వారిపట్ల మీరు వైరభావం పెట్టుకోవద్దు. వారిపట్ల మీరు వైరం పెట్టుకొంటే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా ప్రేమిస్తూ ఉంటే మీరు తిరిగి వారిని ప్రేమిస్తారు. మిమ్మల్ని ద్వేషించే వారిని మీరు ప్రేమించరు. మిమ్మల్ని ఎవరైనా ప్రేమిస్తూ ఉంటే తిరిగి వారిని ప్రేమిచటం అది సామాన్యమానవులు చేస్తున్నారు కదా. మిమ్మల్ని ద్వేషించేవారిని కూడా ప్రేమించగలగాలి లేకపోతే మీకు భక్తిలేనట్లే. ఫలానావ్యక్తి మన శత్రువు అని అనుకోవద్దు. ఎందుచేతనంటే అలా అనుకోవటం వలన మన మనస్సు బాహ్యముఖానికి పోతుంది. నీవు ఎవడి మీద అయితే ద్వేషం పెట్టుకొన్నావో నిరంతరం వాడే నీకు జ్ఞాపకం వస్తాడు కాని వాసుదేవుడు జ్ఞాపకం రాడు. ప్రపంచంలో ఉన్న జీవకోటి అందరిపట్లా నువ్వు పాజిటివ్‌గానే ఉండు, నెగిటివ్‌గా ఉండవద్దు, మీరు డబ్బు ఎలా సంపాదించుకొంటున్నారో, విద్య ఎలా సంపాదించుకొంటున్నారో అలా కష్టపడి మంచి గుణాలను, దైవీగుణాలను సంపాదించుకొంటే అప్పుడు నాకు భక్తుడు అవుతాడు, అప్పుడు వాడి అజ్ఞానాన్ని తీసేసుకొని నా స్వరూపాన్ని వాడికి ఇస్తాను అంటున్నాడు పరమాత్మ. భగవదనుభవం పొందటానికి ఏ కామక్రోధాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి మీరు ఏదో కష్టపడుతున్నారు, కష్టపడినా ఫెయిల్ అవుతున్నారు అని ఆయన గ్రహించి మీ కామక్రోధాలను ఆయన నాకేస్తాడు,

నాకేసి మిమ్మల్ని వదిలేయడు, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, వాడు పరమాత్మ.

ఈ రోజు ఒక డాక్టరుగారు మా ఇంటికి వచ్చారు. మీకు ఏమైనా కోరికలు ఉన్నాయా అని అడిగాను. పునర్జన్మలేని స్థితిని పొందాలి అని ఉంది అన్నారు డాక్టరుగారు. మీరు మరల డాక్టరుగా పుట్టాలని కోరుకోండి. ఇప్పుడు ప్రాక్టీసు చేసి చాలా డబ్బు సంపాదిస్తున్నారు, మరల వచ్చే జన్మలో డాక్టరు అయ్యి ఇంకా డబ్బు సంపాదించవచ్చు అని చెప్పాను. డాక్టరుగారు ఏమన్నారు అంటే బతకటానికి డబ్బు అవసరమే కాని అదే సర్వస్వం అనుకోవటం పొరపాటు. ఏదీ శాశ్వతం కాదు, ప్రతీదీ అశాశ్వతం. సంపదలో ఉన్న అల్పత్వం నాకు తెలిసింది అన్నారు డాక్టరుగారు. ప్రతీ మనిషికి పుట్టుకతోటి ఒక స్వభావం ఉంటుంది. తన స్వభావానికి అనుగుణమైన పని చేసుకోవటం స్వధర్మం, స్వభావానికి విరుద్ధమైన పని చేయటం పరధర్మం. ఎవడో రాజకీయాలలోనికి వెళ్ళాడని నువ్వు వెళ్ళకు. నీ స్వధర్మం ఏమిటో నువ్వు చూసుకో. నీ స్వధర్మానికి విరుద్ధంగా వెళ్ళినా నువ్వు ఫెయిల్ అవుతావు. స్వధర్మం ఆచరించే వాడు ప్రాణప్రయాణ సమయంలో నిర్మలంగా, శాంతిగా వెళ్ళిపోతాడు. పరధర్మంలో ఉన్నవాడు అశాంతిగా చనిపోతాడు.

మీ ఇంద్రియాలకు వాసుదేవుడే కనిపించాలి, మీ మనస్సుకు వాసుదేవుడే కనిపించాలి. వాసుదేవుడికి భిన్నంగా మీకు ఏదీ కనబడకూడదు. అప్పుడు ఆయన అనుగ్రహానికి పాత్రులవుతారు. ఎప్పుడైతే వాసుదేవుడి అనుగ్రహానికి పాత్రులయ్యారో ఆయన స్వరూపం మీకు ఇవ్వబడుతుంది. మీలో ఉన్న అజ్ఞానాన్ని ఆయన తీసుకొని ఆయనలో ఉన్న జ్ఞానాన్ని మీకు ఇస్తాడు. ఈ వాక్యాన్ని రోజూ మననం చేసుకోండి. ఈ వాక్యాన్ని నేను బాగా ఇష్టపడుతున్నాను కాబట్టి మీకు రిపీటెడ్‌గా చెపుతున్నాను. దేవుడి బొమ్మని ఎలా ధ్యానం చేస్తున్నారో అలా ఈ వాక్యాన్ని ధ్యానం చెయ్యండి. ఈ వాక్యాన్ని నాకు కిస్ చేయాలని ఉంది. మీ ఇంద్రియాలకు, మనస్సుకు నేను తప్పించి ఏదీ కనబడకూడదు అంటున్నాడు పరమాత్మ. ఇంక అప్పుడు క్రియేషన్ ఎక్కడ ఉంది. అప్పుడు మీరు నో మైండ్ స్టేట్‌కు వెళతారు, అప్పుడు సత్యం మీకు అనుభవంలోనికి వస్తుంది. మన బుద్ధి పాడైపోవటం వలన భగవంతుడు చెప్పిన ఈ వాక్యాలమీద మనకు సజీవమైన విశ్వాసం కలగటంలేదు. ఆ విశ్వాసం కలగటం కోసమే మహాత్ముల యొక్క సహవాసం అవసరం. ఏ వాతావరణంలో మనకు ఆధ్యాత్మికఅభివృద్ధి కలుగుతుందో ఆ వాతావరణాన్ని మనం వెతుక్కోవాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఏప్రియల్ | 6 | గుమ్మలూరు |
| ఏప్రియల్ | 12 | కొమ్మర శ్రీరామనవమి |
| ఏప్రియల్ | 17 | ముమ్మిడివరం మధ్యాహ్నం 2 గం॥లకు శ్రీ ఉమాసూరేశ్వరస్వామివారి కళ్యాణం నిమిత్తం |
| ఏప్రియల్ 18 నుండి ఏప్రియల్ 25 అరుణాచలం క్యాంపు | | |
| మే | 1 | జిన్నూరు, శ్రీ రమణక్షేత్రం |
| మే | 9 | గుండుగొలను |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# నిజమైన సాధన

మహాత్ముల బోధలు కేవలం వినడము, చదవడమే కాకుండా వాటిని త్రికరణ శుద్ధిగా ఆచరణలో పెట్టాలి. అనేక విషయాలు మరియు సమాచారాన్ని బుద్ధిపరంగా గ్రహించడం కన్నా కనీసం కొన్ని వాక్యముల సారాన్ని ఆచరణలో పెడితే మనకు ఆధ్యాత్మిక ఉన్నతి కలుగుతుంది. జీవిత విధానం వేరు, సాధన వేరు కాదు. జీవితంలో ప్రతి నిత్యం, ప్రతిక్షణం లక్ష్యసాధనకై సద్వినియోగం చేసుకోవాలి.

మనకు వచ్చే తలంపుల పట్ల, చేసే పనిపట్ల సరియైన అవగాహన ఉంటే ప్రతిక్షణం సాధనగా మారుతుంది. నిరంతర స్వరూప ఎరుకవల్ల సరియైన అవగాహన ఏర్పడుతుంది. దేహానికి ఆహారం, నీరు ఎంత ముఖ్యమో, మనస్సు కు దాని తాలూకు అధిష్టానము యొక్క ఎరుక అంతే ముఖ్యం. సమాజంలో సంచరిస్తున్నప్పుడు, పనిచేస్తున్నప్పుడు అనేక నామ రూపాల ద్వారా ఆ పరమాత్మనే సేవిస్తున్నాను అనే దృక్పథం రావాలి. ఇట్టి సాధనకు ప్రత్యేకమైన కాలము, ప్రదేశములతో పనిలేదు. పరమాత్మ ఎక్కడో దూరంగా మనకన్నా భిన్నంగా లేడు, మన నిజమైన ఉనికియే పరమాత్మ. ఆత్మసాక్షాత్కారం అంటే వ్యక్తి భావన అనంత తత్త్వంలో తన ఉనికిన కోల్పోవడమే! దృష్టి విశాలమైతే సృష్టి బ్రహ్మాకారం చెందుతుంది. కర్తృత్వ బుద్ధితో చేసే ప్రతి పనికి ఫలితం సుఖదుఖఃల రూపంలో ఉంటుంది. కర్తృత్వం నశిస్తే పని, ఫలితం రెండూ ఆనందమే! అంతా బ్రహ్మమే! మనము చేసే పనిని విడిచిపెట్టడంకాదు, 'నేను-నాది' అనే భావనను విడిచిపెట్టడమే సాధనా గమ్యం.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# కీర్తికాంక్ష - సత్యపథం నుంచి దూరం చేస్తుంది

కీర్తి కాంక్ష పాపాలలో కెల్ల పాపమైనది. ఇది సమస్త ప్రపంచంలోనూ వ్యాపించింది. నీచులు మొదలు అందరూ పొగడ్తను ఆహ్వానిస్తారు. దానికి దాసులు అవుతారు. గౌరవించబడాలని స్తుతించబడాలని ఆశిస్తారు. నిజానికి పొగడ్తకు తగినవారు చాలా అరుదు. ప్రతీ మానవుల్లోనూ సత్యమైన ఆత్మ ఉంది. యదార్థానికి పరమాత్మను అనుభవంలోకి తెచ్చుకొన్నవారు పూజ్యులు. భౌతిక దేహంలో దానికి అర్హత లేదు అవి నిజం కావు. పొగడ్త పాపం వలన పుడుతుంది. మనం శరీరానికి, మనస్సుకు అతీతమైనప్పుడు పరమ పూజ్యులమౌతాము. మనమే ఆదర్శవంతమౌతాము. దేహాభిమానమే పాపకారణం అందులో దోషం ఉంది పొగడ్తలో గర్వం అనే విష రోగానికి గురికావటం దేనికి. డాంబికతతో సమస్త విశ్వంలో రాజ్యమేలటం దేనికి. భగవాన్ వద్ద ఒకరు మీరు కుమారస్వామి అవతారమని పద్యం వ్రాసి చదువుతూ ఉంటే "నేను గొప్పవాడినైతే నీకు ఏమి కలిసివస్తుంది నిన్ను నీవు తెలుసుకుంటే ఈ గొడవ ఉండదు" అన్నారు. శ్రీరామతీర్థ "నిన్ను నీవు సంపూర్ణంగా మరిచిపోతే కాని ఆనందం కలగదు ఏమాత్రం కించిత్తు స్వార్థ, ఆవేశం ఉన్నా అది పాడుచేస్తుంది. ఇది కష్టమైన విషయమే ఇంతకన్నా మరోమార్గం లేదని నిస్సంశయంగా చెబుతాను" అన్నారు. మనస్సు ద్వంద్వాలతో కూడిన ప్రపంచానుభవాన్ని ప్రసాదిస్తుంది. మనస్సును ఆపాలి. శ్రీనాన్నగారు "ఇతరులు మనలను గౌరవించాలనే ఆలోచన రావటం అంటే లోపల వెలితి ఉండబట్టే వస్తుంది. బుద్ధిమంతుడికి ప్రచారం అక్కరలేదు. నిన్ను ఇతరులు పొగిడినా లేదా నిన్ను నీవు పొగుడుకున్నా అల్లరే కాని అందులో ఏ ప్రయోజనం లేదు. సమర్థత ఉన్నవాడు సమర్థత మీదనే ఆధారపడతాడు. గౌరవం బానిసత్వం. అది వదిలేస్తే లోకవాసన పోతుంది. కీర్తికాంక్ష స్వార్థమే అది ఉన్న వానికి సత్యం తెలియబడదు. ఇతరులు పొగిడినా, విమర్శించినా మీ గురించి మీరు వివేకంగా అంచనా వేసుకోవాలి అది ముఖ్యం. ఇతరుల ప్రేమ పొందాలనుకోవటం నీ బలహీనతకు, చేతకానితనానికి నిదర్శనం. మన మీద మనం ఆధారపడాలి" అన్నారు. బలహీనత తప్ప మరోపాపం లేదు అది అజ్ఞానం నుంచి వస్తుంది జీవనం-స్వప్నం. మనిషి సాక్షి, సాక్షిగా ఉంటే స్వప్నం కరిగిపోతుంది. కంటికి కనిపించేది, చెవులకు వినిపించేది సత్యం అనుకొనేవారు భాగ్యహీనులు వారికి సత్య నిష్టకుదరదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**